- అడుగడుగునా నీరాజనం
- 28 కిలోమీటర్లు.. 7 గంటల సమయం
- గువ్వలచెరువు నుంచి రాయచోటికి..
- వందలాది వాహనాలు.. వేలాదిగా అభిమానులు
- గజమాలలతో భారీగా సత్కారం

మంత్రి మండిపల్లికి అపూర్వ స్వాగతం

రాయచోటిటౌన్, జూన్ 15: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి జిల్లాలో అభిమానులు, నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. శనివారం ఉదయం కడప నుంచే ఆయనకు అభిమానులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈనెల 12వ తేదీ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం మొదటిసారిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జిల్లా కేంద్రమైన రాయచోటికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రికి జిల్లాలో అపూర్వ స్వాగతం లభించింది. గువ్వలచెరువు ఘాట్ దగ్గర నుంచి ప్రజలు వేలాదిగా రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి ప్రతి గ్రామం వద్ద, రామాపురం మండల కేంద్రంలో మంత్రికి ఘనస్వాగతం పలికారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటలకు గువ్వలచెరువుకు చేరుకున్న మంత్రి రాత్రి 8 గంటలకు రాయచోటిలోని తన నివాసానికి చేరుకున్నారు. గువ్వలచెరువు నుంచి 28 కిలోమీటర్ల దూరం ఉన్న రాయచోటికి చేరుకోవడానికి మంత్రికి దాదాపు 7 గంటలకు పైగా సమయం పట్టింది. దీనిని బట్టే తెలుస్తుంది ఆయనకు అభిమానులు ఎంతగా నీరాజనాలు పలికారో. మొదట గువ్వలచెరువు గ్రామంలో క్రేన్ ద్వారా భారీ గజమాలతో ప్రజలు స్వాగతించారు. ఇసుక వేస్తే రాలనంత జనం హాజరై డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో గువ్వలచెరువు, కొత్తరోడ్డు, నారాయణపురం, నీలకంఠ్రావుపేట, రామాపురం, గంగనేరు, కొండావాండ్లపల్లె, చిట్లూరు, బండపల్లె, బిట్స్ కళాశాల, రింగు రోడ్డు మీదుగా రాయచోటి పట్టణంలోని భారీ ర్యాలీ ద్వారా మంత్రి పార్టీ కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా రామాపురం ప్రజలు రెండు భారీ క్రేన్‌ల ద్వారా గజమాలతో మంత్రికి స్వాగతం పలికారు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ప్రజలు ఊరూరా నిలబడి బొకేలు, పూలమాలలతో మంత్రికి స్వాగతం పలుకగా ప్రతి ఒక్కరినీ మంత్రి చిరునవ్వుతో నమస్కరిస్తూ... పేరుపేరునా పలకరిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. గతంలో ఎన్నడూ ఎప్పుడూ చూడని విధంగా గువ్వలచెరువు ఘాట్ నుంచి రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ ద్వారా ప్రజలు రావడంతో బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు ప్రజలకు, మంత్రి చేతులు ఊపుతూ ప్రయాణికులు తమ ఆనందం వ్యక్తం చేశారు. గువ్వలచెరువు ఘాట్ నుంచి రాయచోటి రింగు రోడ్డు వరకు భారీ సంఖ్యలో ప్రజలు వాహనాల్లో తరలివచ్చారు. మంత్రి కాన్వాయ్ రాయచోటికి చేరుకున్న అనంతరం మాసాపేటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. అలాగే రానా



కాన్వాయ్‌లో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి మండిపల్లి



రామాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సర్కిల్ వద్ద ముస్లిం మైనార్టీలు క్రేన్ ద్వారా భారీ గజమాలతో స్వాగతం పలికి జై చంద్రన్న, జైరాముడన్న, జై లోకేశ్ అన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అపూర్వ స్వాగతం పలికారు. రాయచోటిలో వైసీపీ కోటను బద్దలు కొట్టి టీడీపీ తరపున పోటీ చేసే కూటమి అభ్యర్థిగా విజయం సాధించి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేరుకోవడంతో రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావడంతో రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ జనసంద్రంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ సీఐలు సుధాకర్‌రెడ్డి తులసీరామ్‌ల ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వల్లి, అభిమానులు పాల్గొన్నారు.

ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి కృషి

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 15: ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెలలో 20 రోజుల పాటు జిల్లాలో ఉంటూ ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి రాయచోటి వెళుతూ శనివారం మార్గమధ్యంలో కడప విజయదుర్గా ఆలయాన్ని సందర్శించారు. తొలిసారిగా మంత్రి పదవిని చేపట్టిన ఆయనకు ఆలయ నిర్వాహకులు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి దుర్గాప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెలకట్టలేని ఎంతో అభిమానంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకం, విశ్వాసంతో మంత్రి పదవిని ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని ప్రజల అభిమానం, విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా మంత్రిగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. రాష్ట్రంలో కడప జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఐదేళ్లలో ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిధులు, సంక్షేమ పథకాలు తీసుకువస్తామని అన్నారు. గత ఐదేళ్లలో ఈ రాష్ట్రంలో ఎన్నో ఆకృత్యాలు, ఆగడాలు చూశారన్నారు. అవి పునరావృతం కాకుండా ప్రజలు తమపై పెద్ద బాధ్యతలు పెట్టారని అన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు అని, నాలుగోసారి సీఎం కావడం ఆంధ్ర ప్రజలు చేసుకున్న పుణ్యమని అన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందని, తమ బిడ్డలకు, కార్మికులకు, వర్తకులకు ఒక సువర్ణ అవకాశం వచ్చిందని దానిని సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఉమ్మడి కడప జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తామని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వివిధ శాఖలకు చెందిన అధికారులతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి



అక్రమాలపై అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే

- తాగునీటి పేరుతో రూ.కోట్లు కొట్టేశారు
- ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 15: పీలేరు గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై ప్రత్యేకంగా విజిలెన్స్ విచారణ చేయించనున్నట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. రూ.కోట్లలోనే నిధులు దుర్వినియోగం జరిగాయని, స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం నగరిపల్లెలో తనను కలుసుకోవడానికి వచ్చిన వివిధ శాఖలకు చెందిన అధికారులతో జరిగిన సమావేశంలో పీలేరు పంచాయతీ, కేవీ పల్లెలో జరిగిన అక్రమాలను ప్రస్తావించారు. పీలేరు గ్రామ పంచాయతీలో రాజకీయ నాయకుల భార్యలు పారిశుధ్య కార్మికులు, ఇతర తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్నట్లు జీతాలు చెల్లించారని తెలిపా రు. ప్రజలకు తాగునీటిని రవాణా చేశారని చెబుతూ రూ.కోటి దాటి బిల్లులు చేశారని, కొత్త భవన నిర్మాణాల అనుమతుల కోసం ఒక్కో భవనానికి లక్షలాది రూపాయలు వసూలు చేశారని, వాటిని ప్రభుత్వానికి జమ చేయకుండా కాజేశారని తెలిపారు. ఇలా చెప్పుకుంటూపోతే పంచాయతీలో జరిగిన అక్రమాలకు అంతేలేకుండా ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు చేసిన తప్పులు అంగీకరిస్తే కొద్దిపాటి శిక్షలతో బయటపడతారని, విజిలెన్స్ విచారణలో వెల్లడైతే చివరకు అధికారులు, డబ్బు డ్రా చేయడానికి బాధ్యులైన వారు మాత్రం తప్పించుకోలేరని చెప్పారు. పీలేరు పట్టణంలో కార్పెంటర్ల కాలనీ పేరుతో ఏపీఐఐసీ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని, దీనికి సంబంధించి ఏపీఐఐసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం లబ్ధిదారులను మోసం చేయడమేనని తెలిపారు. కేవీ పల్లె మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనాన్ని అక్కడి వైసీపీ నాయకుడు అమ్ముకున్నా రెవెన్యూ అధికారులు ఎలా చూస్తూ ఊరుకుంటారని తహసీల్దారును నిలదీశారు. నకిలీ పత్రాలను సృష్టించారని తహసీల్దారు చెప్పడంతో అదే నిజమైతే పోలీసుల చేత చీటింగ్ కేసు నమోదు చేయించాలని తెలిపారు. హంద్రీ నీవా కాలువ భూములు, కుంటలు చదును చేసి లేఔట్లు వేసినా అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించారు. పీలేరులో పేదల కోసం వేసిన లేఔట్లలో లబ్ధిదారుల పేర్లు గందరగోళంగా ఉన్నాయని, ఆఫ్‌లైన్‌లో ఒక పేరుంటే అదే పట్టాకు ఆన్‌లైన్‌లో మరో పేరుందని, హౌసింగ్ అధికారులు క్షుణ్ణంగా సరిచూసి వివరాలు సిద్ధం చేయాలని కోరారు. త్వరలో మండలాల వారీగా సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి సమగ్రంగా చర్చలు జరుపుతామన్నారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన తహసీల్దారు, ఎంపీడీవోలు, ఇంజనీర్లు, హౌసింగ్, పీఆర్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. పీలేరు, కేవీ పల్లె మండలాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కూడా హాజరయ్యారు.

పక్కా గృహానికి రెండు సెంట్ల స్థలం

- పట్టణంలో 50 వేల మొక్కలు నాటేలా చర్యలు
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జూన్ 15: పేదలకు మంజూరు చేసే పక్కాగృహానికి రెండు సెంట్ల స్థలం మంజూరు చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మొదటిసారి నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్‌వీఆర్ కల్యాణమండపంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వంలో గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా పేదలకు మంజూరు చేసే పక్కాగృహానికి రెండు సెంట్ల స్థలం మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఒకటిన్నర సెంట్ల స్థలంలో ఇల్లు కట్టుకునే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, ముందస్తుగా స్థలాలు సేకరించాలని ఆదేశించారు. మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని, ఇందులో పట్టణంలో ఏడాదిలో 50 వేల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి ఆదివారం పట్టణ సచివాలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, వన్‌బీలను ఎప్పటికప్పుడు జారీ చేయాలని, అవకాశం లేనప్పుడు ఎందుకు చేయలేకున్నామో పూర్తి సమాచారంతో రైతుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల మంజూరు చేయడంలోను, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో తాగునీటి పథకాలకు 24 గంటల్లో విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి, తర్వాత ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కొందరు రౌడీమూకలు, దళారులు దందా చేస్తూ ఖాళీగా ఉన్న పేదల ఇల్లు, స్థలాలను కబ్జా చేసి ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. వీటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ రమాదేవి, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ దీన్‌దయాల్‌రాజును ఆదేశించారు. చిప్పిలి, గుట్టకిందపల్లె ఎస్.ఎస్.ట్యాంకుల మొరవల నిర్మాణానికి ఇసుక సమస్య ఉందని హంద్రీ-నీవా ఈఈ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఇసుక ఎక్కడున్నా తీసుకోండని ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు. పట్టణ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాలివీడు సమీపంలోని వెలిగల్లు రిజర్వాయరు నుంచి తీసుకోవచ్చని పబ్లిక్ హెల్త్ ఈఈ సూచించగా, అందుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులు, సిబ్బంది వివరాలు ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రోడ్డును దున్నేశారు..

- టీడీపీ నేతలపై ఆగని వైసీపీ నేతల దాడులు
- టీడీపీ నేత వేసిన రోడ్డు ధ్వంసం

కురబలకోట, జూన్ 15: తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ నేతల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టీడీపీ నాయకుడు తమ సొంత పొలానికి వెళ్లేందుకు వేసుకున్న రోడ్డును వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో దున్నేశారు. అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులు తమ దౌర్జన్యాలను మాత్రం ఆపడం లేదు. కురబలకోట మండలంలో వైసీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని పలువురు టీడీపీ నేతల ఆస్తులను నష్టపరిచారు. రెండేళ్ల క్రితం మట్లివారిపల్లె మాజీ సర్పంచ్ రుద్రసరస్వతి, టీడీపీ నేత రుద్రబాలకృష్ణలు గౌడసానివారిపల్లె సమీపంలో భూమిని కొనుగోలు చేసి తమ పొలానికి వెళ్లడానికి సొంత నిధులతో రోడ్డును వేసుకున్నారు. అప్పట్లో వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ఆ రోడ్డును దున్ని ధ్వంసం చేశారు. అప్పట్లో బాధితుడు ముదివేడు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. అంతేకాకుండా పలుమార్లు ఆయనను పోలీసులు స్టేషన్‌కు పిలిపించుకుని ఇబ్బంది పెట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈనెల 12న సీఎం చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకారం రోజున మళ్లీ సొంత నిధులతో రోడ్డును వేసుకున్నారు. అయితే శనివారం మళ్లీ మట్లివారిపల్లెకు చెందిన వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ఆ రోడ్డును దున్నేశారు. ఈ మార్గా న వెళుతున్న వారు గమనించి బాధితులకు సమాచారం అందించారు. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చినా కూడా టీడీపీ నేతలపై వైసీపీ నేతల ఆగడాలు ఏమాత్రం తగ్గడం లేదు. దీనిపై బాధితుడు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



ఇటీవల వేసిన తారురోడ్డు



శనివారం వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో దున్నేసిన తారురోడ్డు

బంగారం అమ్మకాలలో జోస్ ఆలుక్కాస్ జోరు

- కడపలో కొత్త షోరూం ప్రారంభం
- సందడి చేసిన సినీ నటి నిధి అగర్వాల్



జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం అనంతరం బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, సినీ నటి నిధి అగర్వాల్, షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కా

కడప (మారుతీనగర్), జూన్ 15 : వినియోగదారుల విశ్వాసాన్ని మరింతగా చూరగొన్న జోస్ ఆలుక్కాస్ అమ్మకాలలో తనదైన శైలిలో మరింతగా జోష్ కనబరుస్తోంది. శనివారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో నూతనంగా సరికొత్త జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, సినీనటి నిధి అగర్వాల్ హాజరై షోరూంను ప్రారంభించారు. అనంతరం వారు షోరూంలో వివిధ డిజైన్‌లలో రూపుదిద్దుకున్న బంగారు ఆభరణాలను తిలకించి డిజైన్లు బాగా ఉన్నాయని కితాబిచ్చారు. అనంతరం షోరూంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాధవీరెడ్డి మాట్లాడుతూ కడప నగరంలో సరికొత్త సొబగులతో జోస్ ఆలుక్కాస్ షోరూం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఇప్పటికే నగరంలో వివిధ బంగారు ఆభరణాల షోరూంలున్నప్పటికీ అధునాతన డిజైన్‌లతో మహిళలను ఇట్టే ఆకర్షించేలా కొంగ్రొత్త రూపులలో జోస్ ఆలుక్కాస్ షోరూం చేరువలోకి రావడం హర్షణీయమన్నారు.

వినియోగదారులకు బంపర్ ఆఫర్ : మేనేజింగ్ డైరెక్టర్లు

జోస్ ఆలుక్కాస్ షోరూంలో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు 60 వేల రూపాయలు బంగారం కొనుగోలు చేసే వినియోగదారులకు బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నట్లు జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కా తెలిపారు. అదనంగా వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు వెల్లడించారు. బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు కూడా వర్తిస్తుందన్నారు. ప్రతీ కొనుగోలుపై ఒక ఉచిత బహుమతిని అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. వివాహ వేడుకల కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్లు కలవన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వినియోగదారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడి చేసిన నిధి అగర్వాల్

షోరూం ప్రారంభోత్సవానికి హాజరైన సినీనటి నిధి అగర్వాల్ కడపలో సందడి చేశారు. ఆమెను చూడడానికి యువకులు అధిక సంఖ్యలో షోరూం వద్దకు చేరుకున్నారు. దీంతో కొంత ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్కు క్రమబద్ధీకరించారు. యువత జోష్‌తో నిధి అగర్వాల్‌ను డ్యాన్స్ చేయాలని కోరగా ఇస్మార్ట్ శంకర్‌లోని సిలక...సిలక సిలక..ఇది సిత్రాంగి సిలక అనే పాటకు డ్యాన్స్ చేసి అభిమానులను ఉత్సాహపరిచారు.

టీడీపీ మద్దతుదారుడి దుకాణం ధ్వంసం

- ఎన్నికల్లో ఏజెంట్‌గా కూర్చున్నందుకు వైసీపీ మూకల దాడి

రైల్వేకోడూరు (రూరల్) జూన్ 15: ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్‌గా పోలింగ్ బూత్‌లో కూర్చున్నందుకు వైసీపీ మూకలు శుక్రవారం అర్ధరాత్రి టీడీపీ మద్దతుదారుడు నూతనంగా నిర్మిస్తున్న దుకాణాన్ని ధ్వంసం చేశారు. వివరాల మేరకు... మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని జాతీయ ప్రధాన రహదారి పక్కనే తన సొంత స్థలంలో టీడీపీ మద్దతుదారుడు షేక్ షకూర్ నూతన దుకాణాన్ని నిర్మిస్తున్నాడు. గతంలో వైసీపీ నాయకులు ఎన్నో ఆటంకాలు కలిగించినా అన్నీ అధిగమించి నిర్మాణం పూర్తి చేశాడు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో టీడీపీ విజయం కోసం ప్రచారంలో పాల్గొన్నాడు. వైసీపీ నాయకులు ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా టీడీపీ విజయం కోసం పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చున్నాడు. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం కావడంతో అది జీర్ణించుకోలేక అర్ధరాత్రి గుర్తు తెలియని వైసీపీ మూకలు దుకాణంలోకి ప్రవేశించి ఫర్నీచరు, నీటి పైపులు, విద్యుత్ బల్బులు, నీటి ట్యాంకు ధ్వంసం చేశారు. ఈ మేరకు శనివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ టి.బాబు తెలిపారు.



ధ్వంసం చేసిన విద్యుత్ సామాగ్రి

సప్తగిరి గ్రామీణ బ్యాంక్

(ప్రభుత్వ రంగ సంస్థ : ఇండియన్ బ్యాంక్‌చే ప్రాయోజితం)

ప్రభుత్వ రంగ బ్యాంకులో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్న బ్యాంక్

వడ్డీ రేటు

కాల పరిమితి	సాధారణ పౌరులకు	సీనియర్ సిటిజన్స్
2 to < 3 Years	8.10%	8.60%
1 to < 2 Years	7.75%	8.25%



సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చందుకిషోర్ (ఫైల్ ఫొటో)

అతివేగం... ఆవేశం.... ప్రాణాపాయం

వేగం ఎక్కువ... వయసు తక్కువ... ● ప్రాణాలు కోల్పోతున్న మైనర్లు
అవగాహన లేక నెత్తురోడుతున్న రోడ్లు ● కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు

చిట్వేలి, జూన్ 15: అతివేగం, ఆవేశం రెండూ ప్రమాదకరాలని పెద్దలు చెబుతూనే ఉంటారు. రెండింటిలో ఏది ఎక్కువైనా మూల్యం చెల్లించుకోక తప్పదని కాలం చెబుతూనే ఉంది. ద్విచక్ర వాహనాలు నడిపేందుకు నేటి కుర్రకారు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాన్ని వేగంగా నడుపుతూ అడ్డూ అదుపులేకుండా దూసుకెళుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ నైపుణ్యం స్నేహితులకు చూపించాలనే తాపత్రయం సరదా షికారు మోజులో ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ తల్లిదండ్రులకు గర్భకోశం మిగిలిస్తున్నారు.

అతివేగంతో పోతున్న ప్రాణాలు

చేతిలో వాహనం ఉంటే హద్దులు మరచిపోతున్నారు. ఇంట్లో వారికి తెలియకుండా బైకులు బయటకు తీసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రయ్‌రయ్ మంటూ రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టేస్తున్నారు. హీరోలా చేతులు వదిలి డ్రైవింగ్ చేస్తూ పట్టుతప్పి పడిపోతున్నారు. ఒక వాహనం మీద ముగ్గురు లేక నలుగురు కూర్చుని గాలిలో తేలిపోతున్నట్లు అతివేగంగా అడ్డదిడ్డంగా నడుపుతూ పాదచారులకు, వాహనదారులకు ఎదురుగా వస్తున్న వారిని గాయపరుస్తున్నారు.



మే 27న అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలుడు (ఫైల్‌ఫొటో)

చెడు అలవాట్లకు బానిస అవుతూ

దేశానికి కుటుంబానికి వెన్నుదన్నులా ఉండాల్సిన నేటి యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారు. ఎంజాయ్ పేర్లతో పార్టీలు చేసుకుంటూ చెడు మార్గంలో పయనిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులతో చిట్వేలిలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వస్తుందో ఎక్కడ గుద్దేసి వెళ్లిపోతుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

18 ఏళ్ల లోపు పిల్లలు మోటారు వాహనాలను నియంత్రించే సామర్థ్యాలు ఉండవు, మోటారు వెహికల్ చట్టాలు, నిబంధనపై అవగాహన ఉండదు. ద్విచక్ర వాహన అనుమతులు పొందేందుకు అర్హులు కారు. విషయాలన్నీ పిల్లలకు తెలియజేసేందుకు రోడ్డు భద్రత వారోత్సవాలతో పాటు సాధారణ రోజుల్లోనూ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, రవాణా, పోలీసు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పూర్తిస్థాయిలో అవగాహన చర్యలు లేకపోవడంతో రోడ్లు నెత్తురోడుతున్నాయి. చిట్వేలి మండలంలో మే 23 గరుగుపల్లె రోడ్డులో మైలపల్లె అరుంధతి వాడ బాలులు అతివేగంగా వస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి చనిపోయారు. మే 27న అంబేడ్కర్ సర్కిల్ వద్ద కోడూరు మండలం అనంతరాజుపేటకు చెందిన ఒకరు, పెనగలూరు మండలం కట్టావారిపల్లెకు చెందిన వ్యక్తి ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించకూడదు

మైనర్లకు బైకులు ఇవ్వకూడదని, ఇచ్చినవారు శిక్షార్హులు అవుతారని అధికారులు చెబుతున్నా పిల్లల తల్లిదండ్రులకు పట్టడంలేదు. శిక్షణ లేని వ్యక్తి చేతిలో ఉన్న వాహనం మారణాయుధం లాంటిది. అది నడిపితే వారితో పాటు ఇతరుల ప్రాణాలకు హాని కలిగిస్తుందని, వాస్తవాలను తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన పెంచాలి. 2022 నుంచి 2024 వరకు 14 మంది చనిపోగా 20 మందికి గాయాలయ్యాయి.

మైనర్లకు వాహనాలను ఇవ్వరాదు



డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే ఎవరికీ వాహనాలను ఇవ్వరాదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వకూడదు. వారు ఓవర్ స్పీడు వెళ్లడం, రేసింగ్ చేస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. రోడ్లపై రాంగ్ డ్రైవింగ్, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడపడం, త్రిపుల్ రైడింగ్ వంటివి చట్టరీత్యా నేరము. తల్లిదండ్రులు జీవనోపాధికి గల్ఫ్‌దేశాలకు వెళ్లి ఇంటివద్ద పిల్లల బాధ్యతను అవ్వాతాతలకు అప్పగిస్తుండడంతో పిల్లలు ఎవరికీ తెలియకుండా వాహనాలను ఎలా పడితే అలా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతూ నూరేళ్ల జీవితాన్ని అంధకారంలో నెట్టుకొంటున్నారు. రోడ్డు భద్రతలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాము. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ విలువలు నేర్పిస్తూ మంచి నడవడికతో పిల్లలను పెంచాలి.

ఎస్ఐ సుధాకర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రసాద్ మృతదేహం

కమలాపురం రూరల్, జూన్ 15: కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై చదిపిరాళ్ల వద్ద స్కూటరులో వెళుతున్న ఒకరు మరొక రిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కడప ఒంటిగారిపల్లెకు చెందిన ప్రసాద్ కడప మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి స్కూటరుపై ఎర్రగుంట్ల నుంచి కడప వైపు వెళుతుండగా సరిగా కనిపించకపోవడంతో రోడ్డుపై వెళుతున్న మరొకరిని ఢీకొట్టినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దీంతో స్కూటరుపై వెళుతున్న ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. గాయపడిన మరొకరిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని శవం లభ్యం

సికెదిన్నె, జూన్ 15: దాదాపు 35 నుంచి 45 ఏళ్లున్న గుర్తు తెలియని శవాన్ని కనుగొన్నట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. మామిళ్లపల్లె సమీప సోమయాజులపల్లెకు ఉత్తరం వైపు కంపచెట్లలో శవాన్ని గుర్తించారన్నారు. శవంపై కాపీరంగు లుంగీపై సబ్బురంగు కలర్ డిజైన్ ఉందని, బ్లూరంగు ఫుల్‌డ్రాయర్, మెరూన్ రెడ్ ఫుల్‌షర్టు ధరించి దాదాపు 5.6 అడుగుల ఎత్తు ఉండవచ్చన్నారు. ఆచూకీ తెలిస్తే సికెదిన్నె పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల వారి కార్యాలయము : కడప.

లేఖ నం. 12/జిజిహెచ్/కడప/2024 తేది :15.06.2024

పత్రికా ప్రకటన

సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప నందు పనిచేయుటకు ఎంపిక కాబడిన Emergency Medical Tech. (2 మంది) ఎంపిక కాబడిన అభ్యర్థుల వివరములు www.kadapa.ap.gov.in వెబ్‌సైట్ నందు ఉంచడమైనది. ఎన్నికైన అభ్యర్థులు 18-6-2024వ తేది పై కార్యాలయమునందు హాజరై నియామకపు ఉత్తర్వులు పొంది విధులలో చేరవలసినదిగా కోరడమైనది.

సూపరింటెండెంట్
ప్రభుత్వ సర్వజన వైద్యశాల
కడప.

ఇంకా జగన్‌కు జ్ఞానోదయం కాలేదు

వైసీపీ రాజ్యాంగ విరుద్ధమైన పార్టీ ● తప్పులు సరిదిద్దుకోకపోతే... ● చంద్రబాబు దూరదృష్టితోనే 'ల్యాండ్ టైటిలింగ్' రద్దు ● భారత న్యాయవాదుల సంఘం



కేక్‌ను కట్ చేస్తున్న భారత న్యాయవాదుల సంఘం నేతలు

కడప(రూరల్) జూన్ 15: ప్రజలు భారీగా తిరస్కరించినా ఇంకా జగన్‌కు జ్ఞానోదయం కాలేదని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ఘాటు విమర్శలు చేశారు. కడప బార్ అసోసియేషన్ హాలులో శనివారం సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ రాజ్యాంగ విరుద్ధమైన పార్టీ అని ఈ కారణంగానే రాష్ట్ర ప్రజలు ప్రతిపక్షహోదా కూడా కల్పించలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భయానక టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేయడం పట్ల ఆయనకు అభినందనలు తెలిపారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రాజ్యాంగ విరుద్ధమైందని, జగన్‌కు రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం ఉన్నా ప్రజల ఆస్తులు, హక్కులకు తీవ్ర నష్టాన్ని కలగజేసే టైటిలింగ్ యాక్టు గురించి నోరు మెదపకపోవడం మంచిదన్నారు. గత ఎన్నికల్లో 151 సీట్లు ఇచ్చిన ప్రజలు జగన్ తప్పులు చేయడంతో సాధారణ ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌కు జ్ఞానోదయం కలగడం లేదన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయానికి భిన్నంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మంచిదని దానితో మంచి జరుగుతుందని నేతిబీరకాయ మాటలు మానుకోకపోతే వచ్చిన 11 సీట్లు కూడా ఉండవని హెచ్చరించారు. కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, న్యాయవాదుల సంఘం గౌరవ సలహాదారులు నాగ సుబ్బారెడ్డి, కడప నగర అధ్యక్షుడు రామకొండయ్య, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అన్నీ అవకతవకలే

● వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడమే ● అధికారులు చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట, జూన్ 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, ఎంపీటీసీ చంద్రబాస్కర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట పంచాయతీలోనే 1148 మంది లబ్ధిదారులకు జాబ్‌కార్డులు ఉన్నాయని, కొందరు వైసీపీ నేతల అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్లు దోచుకుంటున్నారని వివరించారు. ఖాజీపేట వైసీపీ నేతల చెంచాల పేర్లు పెట్టుకుని ఏడాదిలోనే లక్షలు సంపాదించారని విమర్శించారు. మహబూబ్‌బాష (పంపం)ఆయన భార్య మహబూబ్‌చాన్, ఫీల్డ్ అసిస్టెంట్ భార్య సుగుణ ఉద్యోగస్తురాలు. కుమారుడు హేమంత్ 6వ తరగతి, కూతురు సాయి 10వ తరగతి అయిపోయింది. ఒకే కుటుంబంలో మూడు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఖాజీపేట పంచాయతీలో 100 కార్డులు సంబంధించిన సాక్ష్యాలు ఉన్నాయని, ఒక్క ఏడాదిలో రూ.25 లక్షలు అవకతవకలు జరిగాయంటే ఐదేళ్లలో కోట్లలో అవినీతి జరిగి ఉంటుందని, మండల పరిధిలో కూడా ఎంత జరిగిందో అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. అంతేకాక ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు ఎందుకు రాజీనామా చేశాడో, ఎందుకు విధుల్లోకి హాజరయ్యాడో అధికారులు చెప్పాలని, ఇలాంటివారిపై అధికారులు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు టీడీపీ వెంటే : వెంకటరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): ఊపిరి ఉన్నంత వరకూ మా కుటుంబం టీడీపీ వెంటే ఉంటామని కాశినాయన మండల టీడీపీ నేత వెంకటరెడ్డి ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. జిల్లాలో క్లిష్టపరిస్థితుల్లో టీడీపీ వెంటే ఉన్నాం. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులపై జగన్ ఉక్కుపాదం మోపారు. మేం పార్టీ కోసం జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ ఆదేశాల మేరకు నేను, నా భార్య క్లిష్ట సమయంలో జిల్లా వ్యాప్తంగా తిరిగాం. మహిళా అధ్యక్షురాలి హోదాలో నా భార్య బాధితులకు భరోసాగా నిలిచింది. మమ్మల్ని టీడీపీ నుంచి వేరు చేసేందుకు దుష్ప్రచారం చేస్తూ మేమేదో పార్టీ మారినట్లు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం పార్టీ మారలేదంటూ ఆయన వివరించారు. కాశినాయన మండలం శివారెడ్డి కుటుంబానికి అడ్డా. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీపై కేసులు పెట్టారు. అయినా సరే మాకు ఎలాంటి సహకారం లేకపోయినా కూడా మేం పోరాడాం. నిన్న జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం చేశాం. అయితే మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి కనీసం మాకు ఎలాంటి బూత్‌లు కానీ ఎలాంటి బాధ్యతలూ అప్పజెప్పలేదు. మేం టీడీపీ సైనికుల్లా మా ఓటు మేం వేసుకుని మా వెంట ఉన్నాం. అయితే మేం పార్టీ మారినట్లు ప్రచారం చేస్తున్నారు. విజయమ్మ సొంతూరులోనే ఎంపీ అవినాష్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చాయి. మేం నిజాయితీగా టీడీపీకి ఓటు వేశాం. మా మీద విష ప్రచారం మానుకోండి.

'సీమ'లో హైకోర్టు బెంచినైనా ఏర్పాటుచేయాలి

వేంపల్లె, జూన్ 15: రాయలసీమలో హైకోర్టును, లేదా హైకోర్టు బెంచిని గానీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు ఈ రెండింటిలో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాయలసీమలో రాజధానిని, కోస్తాలో హైకోర్టును ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు రాజధాని, హైకోర్టు రెండు కూడా హైదరాబాద్‌కు తరలించబడ్డాయన్నారు. 2014లో విభజన కారణంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటైందన్నారు. ఈ నేపథ్యంలో నవ్యాంధ్రప్రదేశ్‌లో రాజధాని, హైకోర్టుల్లో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాల్సిఉన్నా జరగలేదన్నారు. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అలహాబాద్‌లో హైకోర్టు, రాజధాని లక్నోలో హైకోర్టు బెంచ్ ఉన్నాయన్నారు. కేరళ,గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, అస్సాం, అరుణాచలప్రదేశ్, నాగాల్యాండ్, మిజోరాం రాష్ట్రాల్లో హైకోర్టులు రాజధాని వెలుపల ఉన్నాయన్నారు. కావున రాయలసీమలో హైకోర్టును గానీ, హైకోర్టు బెంచిని గానీ ఏర్పాటుచేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆగని ఇసుక మాఫియా ఆగడాలు

ఏరియాలు పంచుకుని సాగిస్తున్న దందా ● దాడులకు తెగబడుతున్న వైనం
పట్టించుకోని పోలీసు, సెబ్, రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు జూన్ 15: ప్రొద్దుటూరులో వైసీపీ ఇసుక మాఫియా ఆగడాలు ఆగడం లేదు. 'ఎవరు మారితే మాకేంటి ప్రభుత్వం మారినా మాదే హవా' అనే తీరులో ఇసుక దందా సాగుతోంది. 'పోలీసులకు ఇతర అధికారులకు మామూళ్ళు ఇస్తున్నాం మా దందా మేమే సాగిస్తాము ఎవరు వస్తారో రాండి చూసుకుందాం' అంటూ చాలెంజ్ విసురుతున్నారు. ఇసుక మాఫియా ఏరియాలు పంచుకుని పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. ముఖ్యంగా రామేశ్వరం నుంచి ఆర్‌టీపీపీ రోడ్డులో పెన్నానదిలోకి వైసీపీకి చెందిన ఇసుక మాఫియా వారు మరో ప్రాంతం వారిని రానీయడం లేదు. కేవలం తాము మాత్రమే ఇక్కడ ఇసుక తవ్వకాలు చేసుకుంటామని ఎవరు వచ్చినా భయపడేది లేదని తెగేసి చెబుతున్నారు. శనివారం ఉదయం ఆర్‌టీపీపీ వెళ్లే రోడ్డులో పెన్నానదిలోకి బయటి ప్రాంతాల వాళ్ళ ఇసుక ట్రాక్టర్లను రామేశ్వరం వైసీపీకి చెందిన ఇసుక మాఫియాకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కొందరు వన్‌టౌన్ బ్లూకోల్ట్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు చేరుకుని ఘర్షణ జరకుండా చెదరగొట్టారని సమాచారం. కానీ వారిని అదుపులోకి తీసుకోకుండా కేవలం అక్కడి నుంచి పంపించి వేశారని సమాచారం.



గుంతలు తీస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఏరియాలు పంచుకుని సాగిస్తున్న దందా

వైసీపీ ప్రభుత్వం మారి రోజులు గడుస్తున్నా ఇంకా వైసీపీకి చెందిన ఇసుక మాఫియా పెన్నానదిలో కొన్ని ఏరియాలను తమ అధీనంలో పెట్టుకుని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతోంది. ముఖ్యంగా రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్, ఆర్‌టీపీపీ రోడ్డులో రామాపురం ఏరియాల్లో సాగిస్తున్నారు. ఈ ఏరియాల్లో వైసీపీ ముఖ్య నేత అనుచరులైన మార్తల నవీన్‌రెడ్డి మార్తల చంద్రారెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఆ ప్రాంతంలో చెలరేగిపోతున్నారు. ఇటీవల మార్తల నవీన్‌రెడ్డి కోసమే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి సీఐని బెదిరించి ఆయనను విడిపించుకుని తీసుకోచ్చారు.

ముక్తియార్ ఆయిల్ మిల్లు ఎర్రగుంట్ల రోడ్డు అండమాన్ ప్రాంతంలో మరికొన్ని బ్యాచ్‌లు తవ్వకాలు చేస్తున్నారు. చౌడూరు పెద్ద శెట్టిపల్లె కొత్తపేట చౌటపల్లె రామేశ్వరం నంగనూరు పల్లె రేగుల పల్లె కల్లూరు ప్రాంతాల్లో ఇంకా ఇసుక అక్రమ రవాణాను సాగిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం సెబ్ అధికారులు పోలీసులకు స్టేషన్ మాముళ్ల బ్లూకోల్ట్ బ్యాచ్‌లకు మాముళ్ల ఇవ్వడం వలన ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు తమ తీరు మార్చుకుని ఇసుక మాఫియాను నియంత్రిస్తారా లేక ఇంకా పాతపంథాలోనే కొనసాగుతారా చూడాలి.



దౌర్జన్యం చేస్తున్న ఇసుక మాఫియా

మార్గాలను మూస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహసీల్దారు విద్యాసాగర్ ఆదేశాలతో వీఆర్‌ఓలు చెన్నా రవి ప్రకాష్, అమర్‌నాద్‌రెడ్డి ఎక్స్‌కవేటర్‌తో పెన్నానదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా మార్గాలను మూసేందుకు శనివారం రాత్రి భారీగా గోతులు తీస్తున్నారు. ముక్తియార్ ఆయిల్ మిల్లు, ఆర్‌టీపీపీ రోడ్డులో రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ ఏరియాలో గోతులు తీస్తున్నారు. అయితే ఇసుక మాఫియా అక్కడి వచ్చి రెవెన్యూ సిబ్బందిని బెదిరించింది. తీస్తే అన్ని ప్రాంతాలు తీయాలా లేకుంటే గుంతలు పూడ్చుతామని హెచ్చరించారని వీఆర్‌ఓ రవి ప్రకాష్ తెలిపారు. ఒకవైపు గోతులు తీస్తుంటే మరోవైపు ట్రాక్టర్లలతో వ్యర్థాలను తెచ్చి ఇసుక మాఫియా గోతులు పూడ్చుతున్నదని వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న పోలీసులు

ఇసుక మాఫియా ఘర్షణలకు దిగుతూ ఏరియాలు పంచుకుని దందా సాగిస్తుంటే పోలీసులు, సెబ్ అధికారులు మాత్రం ఇది తమ పనికాదనట్లు చోద్యం చూస్తున్నారు. ఇందులో జోక్యం చేసుకుంటే ఎక్కడ తమ మాముళ్ల సంగతి బయట పడుతుందోనని కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇసుక రవాణను అరికడతాం : డీఎస్పీ

ఇసుక అక్రమ రవాణా సాగుతుండడం మా దృష్టికి వచ్చింది. కానీ ఏరియాలు పంచుకుని దందాలు సాగిస్తూ ఘర్షణలకు దిగడంపై వీడియోలు మా దృష్టికి వచ్చాయి. రేపటి నుంచి ఆ ఏరియాల్లో పికెట్ ఏర్పాటు చేయిస్తాం. ఈ మేరకు సీఐలకు ఆదేశాలిస్తాను. ఎవరూ పెన్నానదిలో నుంచి ఇసుక అక్రమ రవాణా సాగించినా ఉపేక్షించమన్నారు. కేసులు పెట్టి ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో రాష్ట్ర ఆడిట్ అధికారులు

నందలూరు, జూన్ 15: చారిత్రాత్మక సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం రాష్ట్ర ఆడిట్ ఏజీ అధికారులు సుమేద్‌బోధి, మహేశ్వరరాజు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరితో పాటు జిల్లా పరిషత్ అధికారులు దేవదర్శన్‌రెడ్డి, వరుణ్, ఎంపీడీఓ ప్రకాష్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

కురబలకోటలో చోరీ


కురబలకోట, జూన్ 15: కురబలకోటలో శని వారం చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... ఆర్యవైశ్య బజారుకు చెందిన వెంకటనారాయణ రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దొంగలు ఇంటి వెనుకవైపు నుంచి ఇంట్లోకి జొరబడి ఇంట్లో బీరువా తాళాలను పగలకొట్టి అందులోని 42 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లారు. కాగా శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగానే చోరీకి గురైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రప్పించి తనిఖీలను నిర్వహించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

కమలాపురం రూరల్, జూన్ 15: కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి పుట్టినరోజు సందర్భంగా నేటి నుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పీఈటీ లు శివశంకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సునీల్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించిన వారు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహించబోయే కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకున్న క్రీడాకారులు నమోదు చేసుకున్న క్రీడా టీములు కూడా ఆదివారం ఉదయం 7గంటలకు కమలాపురం టీడీపీ కార్యాలయానికి చేరు కోవాలని వారు తెలిపారు. వివరాలకు 9110353548, 6304228090 సంప్రదించాలని వారు తెలిపారు.

18న వాహనాల వేలం

ములకలచెరువు, జూన్ 15: తంబళ్లపల్లె, పెద్దమం డ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఎస్ఈబీ అధికారులు 18న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ రామ్మోహన్ తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెబ్ కార్యాలయంలో ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ సమక్షంలో జరిగే వాహనాల వేలంలో ఆసక్తి గల వారు రూ.3వే లు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.



MEGA DSC COACHING
SRR School (గ్లోబల్ కాలేజి ఆవరణము)నందు Mega DSCకి నిపుణులైన అధ్యాపక బృందముచేత కోచింగ్ ఇవ్వబడును. Hostel (Ladies/Gents Separate) వసతి కలదు. సంప్రదించవలసిన చిరునామ సెల్ : 89772 13634, 94948 09109
Ajc-000

WANTED TEACHERS
To teach Biology, English. Q. : B.A.,B.Ed.& B.Sc., B.Ed., Preference for Kadapa Local Candidates. Attractive Salary, Cont. : 78422 52415
AJC-188764

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122.
Ajc-188592

కావలెను
పీలేరు నందు పనిచేయుటకు కష్టపడే తత్వం కల్గి 7వ తరగతి ఆపైన చదివిన 20-35 సం.లోపు పురుషులు అసిస్టెంటుగా కావలెను. జీతం : 12-15 వేలు, సంప్ర : 9866191362
Ajc-188765

వంట మాస్టర్స్ కావలెను
కడప బకెట్ బిర్యాని హోటల్‌లో సౌత్ ఇండియన్ టిఫిన్ సెక్షన్ నందు వంట మాస్టర్ & ఏంజిల్స్ లేడీస్ హస్టల్ నందు లేడి వంట మాస్టర్ కావలెను. జీతం+ఫుడ్ సౌకర్యం కలదు. సెల్ : 98667 68892
Ajc-188767

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 189260

UTI MUTUAL FUND
ప్రతినెల రూ.12,000 6 పథకాలు 180 నెలలు ఆ తరువాత పత్రము నందు చూస్తారు రూ. 78 లక్షలు+. రూ. 10 లక్షలు 5 పథకాలు 180 నెలలు ఆ తరువాత పత్రము నందు చూస్తారు రూ.78 లక్షలు +. రూ. 10 లక్షలకు 3 నెలలకొకసారి రూ.25,000 60సార్లు ఆ తరువాత పత్రమునందు చూస్తారు. AVS Chandra Reddy, Cell : 98660 99827
Ajc-188509

కావలెను
ప్రముఖ స్కూల్ హాస్టల్‌లో పనిచేయుటకు టీచర్లు, వార్డెన్లు, వంట మనుష్యులు, ఆయాలు కావలెను. సంప్ర : 93909 21596
Ajc-188593

WANTED
కడప నగరంలో ప్రముఖ రెసిడెన్షియల్ హైస్కూల్ నందు పనిచేయుటకు క్రింద తెలిపిన అభ్యర్థులు కావలెను. లేడీవార్డన్స్ జీతం:12000, లేడి PET's జీతం :15000, సెక్యూరిటి గార్డ్స్-జీతం : 10వేల నుండి 12వేలు హౌస్ కీపింగ్ వర్కర్స్- జీతం 8000, సెల్: 9059004664, 9849794289
Ajc-156456

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7842241787
AJV_192850

ఉద్యోగాలు
★YMC నూతంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Quali : 10th, Inter, Degree (P/F), Age : 18 to 30. నో ఫీజు. సంప్ర॥ 9177342337
AJW-5967


PROPERTY FOR RENT
★ ప్రొద్దుటూరు రాజీవ్ సర్కిల్ సున్నమ్ బట్టి వీధిలో రూము బాడుగకు ఇవ్వబడును. 9940693126
AJH-0278

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

17 నుంచి బోయకొండ గంగమ్మజాతర



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

గాలివీడు, జూన్ 15: గుండ్లచెరువు కస్పాకు సమీపంలో వెలసిన బోయకొండ గంగమ్మ జాతర 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 17వ తేదీ సోమవారం రాత్రికి నిండు తిరుణాల సందర్భంగా భకులు చాందినీ బండ్లను ఏర్పాటు చేస్తారని, మంగళవారం ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. అమ్మవారి జాతరకు ఏర్పాట్లను ఏర్పాటు చేశామ న్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సుండుపల్లె, జూన్ 15: నాగారపమ్మ తిరుణాల సందర్భంగా శనివారం అమ్మవారికి పూజలు చేసినట్లు ధర్మకర్త కృష్ణమూర్తినాయుడు, చైర్మన్ సుధీర్‌నాయుడు తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకుంటారన్నారు. మొదటిరోజు శనివారం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలియజేశారు.

మండిపల్లికి అడుగడుగునా నీరాజనాలు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి గజమాలను క్రేన్‌తో వేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజంపేట నియోజకర్గ నేతలు

రామాపురం, జూన్ 15: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం మొదటిసారిగా రాయచోటికి వస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి గువ్వలచెరువు ఘాట్ దగ్గర భారీ గజమాలతో ప్రజలు స్వాగతించారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి బొకేలు, పూలమాలలతో స్వాగతం పలకగా మంత్రి అభివాదం చేశారు. గువ్వలచెరువు, కొత్తరోడ్డు నారాయణపురం, మేదరఎల్లి, నీలకంఠ్రావుపేట, రామాపురం, గంగనేరు, కొండావాండ్లపల్లె, చిట్లూరు, బిట్స్ కలాశాల, రింగు రోడ్డు మీదుగా రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయం చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి,నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

రాజంపేట నేతల సన్మానం

రాజంపేట: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని రాజంపేట నేతలు సత్కరించారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాయచోటికి వచ్చిన సందర్భంగా రాజంపేట నియోజకవర్గ నేతలు పోలిసుబ్బారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగసుధాకర్ రెడ్డి, , మైనార్టీ నాయకుడు గుల్జార్ బాషా, పట్టణ బీసీ నాయకుడు కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య తదితరులు బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించారు.

లక్కిరెడ్డిపల్లె: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాదురెడ్డిని శనివారం రాయచోటిలోని మండిపల్లె కార్యాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డెయ్య మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు..

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● **జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి**

రాయచోటిటౌన్, జూన్15: జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి జిల్లా ఐదవ అదనపు జడ్జి కోర్టులో ఈ నెల 29వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి సూచించారు. శనివారం ఆయన సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుల్తానా, అడిషనల్ మెజిస్ట్రేట్ శారద తదితరులతో కలిసి రాయచోటి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, ప్రమాదాలు, భూవివాదాలు, ఎంఈవో కేసులు, బ్యాంకు కేసులు ఇలా అన్ని రకాల కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. కావున రాయచోటి కోర్టు పరిధిలోని కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షిస్తున్న జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Limited, Railway Kodur Branch issues the following notice to the general public. My client intend to grant loan **Sri Avuala Gangadhar** S/o Mallappa, R/o 8/301, Gandhi Nagar, Railway Kodur Village and Mandal, Annamayya District by mortgaging the below schedule mentioned property as security by way of equitable mortgage. As such if anyone has any claims, objections, charges or mortgages, sale agreements, court attachements, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client in this regard. **SCHEDULE OF THE PROPERTIES :** Annamayya District (previously YSR Kadapa District), Pullampeta Sub District, Kodur Mandal and Village, Ward No.8, Extension Area, located in Survey No. 719/2, 719/3, 719/5 of Koduru Village fields in an extent of 117.08 square yards of site. **Boundaries :** East : 15 feet width road, West : 315 feet width road, North : Site of M. Lakshmi Devi, South : Site of C. Bramaramba

R.C. SURESH BABU
ADVOCATE, RAILWAY KODUR

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

రాయచోటి టౌన్, జూన్ 15: సీజనల్ వ్యాధులపై మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శనివారం రాయచోటి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వాసుబాబు ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ, శానిటేషన్ సెక్రటేరియట్ సిబ్బంది, అర్బన్ పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు, వాటి నివారణ, దోమల నివారణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు తప్పకుండా వాడుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వాసుబాబు మాట్లాడుతూ జ్వరాలు వస్తే వెంటనే ఆ ఏరియాలో లార్వా, ఫీవర్ సర్వే, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, మున్సిపల్ అధికారులు మల్లికార్జున, కొండయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

● **మున్సిపల్ కమిషనర్ వాసుబాబు**

రాయచోటిటౌన్, జూన్15: బక్రీద్ సందర్భంగా పట్టణంలోని బండ్లపెంట, ఫ్రూట్స్‌మండీ, మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక జంతు వధశాలల వద్ద శానిటేషన్, నీటి సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఈద్గా, మసీదు వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ మంచి వాతావరణంలో పండుగ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులను కోరారు. పీస్ కమిటీ, మత పెద్దల సూచనల మేరకు పట్టణంలోని బండ్లపెంట, ఫ్రూట్స్ మండి, మార్కెట్‌యార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలిక జంతువధశాలలు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమీక్షలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలతో ఆర్డీవో సమావేశం



రాయచోటి: సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు



ముస్లిం పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మోహన్‌రావు

రాజంపేట, జూన్ 15 : బక్రీద్ సందర్భంగా ఆర్డీవో మోహన్‌రావు శనివారం ముస్లిం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవధచేయరాదన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, రైల్వేకోడూరు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో సీఐ రవీంద్రనాథ్ పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇతర మతాల వారి మనోభావాలకు ఇబ్బందులు కలగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు గోవధ చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వీరబల్లి: బక్రీద్‌ను సామరస్యంగా జరుపుకోవాలని ఎస్‌ఐ చంద్రమోహన్ కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది, పాల్గొన్నా రు.

సుండుపల్లె: బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ ఎస్‌కేఎం హుస్సేన్ సూచించారు. శనివారం బక్రీద్, నాగారపమ్మ తిరుణాల సందర్భంగా ముస్లిం మత పెద్దలు, చాందినీ బండ్లు కట్టే భక్తులతో శాంతి సమావేశం నిర్వహించారు. జూన్ 17న బక్రీద్, నాగారపమ్మ జాతర ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఆవులను వధించడం నేరమన్నారు. అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుణాలలో గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చాందినీ బండ్లు కట్టేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయాన్ని పల్లెల్లో మత పెద్దలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ-2 లక్ష్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ బీడీ నాయక్, ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Limited, Railway Kodur Branch issues the following notice to the general public. My client intend to grant loan **Sri Nagiripati Purushotham** S/o Narayana, R/o 2/149, Obanapalli, Railway Kodur Village and Mandal, Annamayya District by mortgaging the below schedule mentioned property as security by way of equitable mortgage. As such if anyone has any claims, objections, charges or mortgages, sale agreements, court attachements, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client in this regard. **SCHEDULE OF THE PROPERTIES :** Annamayya District (previously YSR Kadapa District), Pullampeta Sub District, Kodur Mandal and Village, Ward No.10, Ranganayakulapeta, R.C.C. Building bearing D.No. 10/60-1, 10/61-1, Assessment No. 1005068, 107796, 1020990 Extension Are, located in Survey No. 704 of Koduru Village fields in an extent of 50 square yards of site. **Boundaries :** East : 15 feet width road Panchayat, West : Site of P. Lakshmamma North : Shaik Basha Penkutillu, South : Midda house sold by shaik mahbub saheb.

R.C. SURESH BABU
ADVOCATE, RAILWAY KODUR

ఆర్.ఓ.సి. నెం.907/2006/ఆర్.ఐ. **పురపాలక సంఘం కార్యాలయము**
రాజంపేట, తేది : 15.06.2024

వేలము నోటీసు

రాజంపేట పురపాలక సంఘంనకు సంబంధించిన దిన మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండ్ గేట్ మరియు జంతువధశాలకు సంబంధించి ఫీజులు వసూలు చేసుకొను గుత్త హక్కును తేది 01.07.2024 నుండి 31.03.2025 వరకు గుత్తకు ఇచ్చుటకు తేది 24.06.2024 సోమవారం ఉదయం 12.00 గంటలకు మరియు మార్కెట్, ఈడిగపాలెం షాపింగ్ కాంప్లెక్స్, పాతబస్టాండు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నందు ఖాళీగా వున్న షాపు రూములను తేది. 24.06.2024 సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజంపేట పురపాలక సంఘం సమావేశ భవనము నందు కమీషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన అధికారిచే గానీ బహిరంగ వేలము నిర్వహించ బడును.

వేలము షరతులు మరియు నిబంధనలు ఆఫీసు పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును. ఏదైని వేలము వాయిదా వేయుటకు రద్దు చేయుటకు మునిసిపల్ కమీషనరు వారు పూర్తి అధికారము కలిగివుందురు.

కమీషనరు, రాజంపేట పురపాలక సంఘం

ఏపీఎండీసీని కాపాడాలి: ఏఐటీయూసీ



ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డితో కార్మిక నాయకులు

ఓబులవారిపల్లె, జూన్ 15 : ఏపీఎండీసీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ, జ్యోతి చిన్నయ్య రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డికి విన్నవించారు. బ్రైటీస్ ఎగుమతుల్లో ప్రథమ స్థానంలో ఉన్న ఏపీఎండీసీ ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందన్నారు. ఏ గ్రేడ్ ముగ్గురాయిని అక్రమ తరలింపుపై విజిలెన్స్ అధికారుల నివేదికను కొందరు అధికారులు తొక్కిపెట్టారన్నారు. కీలకమైన రికార్డులను మాయం చేసేందుకు ప్రస్తుతం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ ఉండగానే పాత తేదీలు వేసి 25 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇసుక, ముగ్గురాయిని అక్రమంగా తరలించుకుని వైసీపీ నాయకులు కోట్ల రూపాయలు సంపాదించుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఏపీఎండీసీకి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు



అన్నమాచార్య యూనివర్శిటీ ఏర్పాటు గర్వకారణం



విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేస్తున్న వీసీ శ్రీనివాసరావు

రాజంపేట, జూన్ 15 : రాజంపేటలో అత్యున్నత విద్యా ప్రమాణాలు కలిగిన అన్నమాచార్య యూనివర్శిటీ ఉండడం గర్వకారణమని అనంతపురం జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాసరావు తెలిపారు. గ్రాడ్యుయేషన్‌డే సందర్భంగా శనివారం రాజంపేట అన్నమాచార్య విద్యా సంస్థల్లో 930 విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య యూనివర్సిటీ ఏర్పాటులో చొప్పా గంగిరెడ్డి కృషి మరువలేనిదన్నారు. జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్ వెంకటనగేష్‌కుమార్, అన్నమాచార్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, అన్నమాచార్య విద్యా సంస్థల ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి , ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవి నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.మారుతిప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్, టిఎన్ రంగనాథం, డీన్స్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ డి.కృష్ణమోహన్‌రాజు, డాక్టర్ ఎన్.శివరామిరెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నందలూరు, జూన్ 15 : మండలంలోని నాగిరెడ్డిపల్లెజూట మారెమ్మ ఆలయంలో శనివారం ఉదయం బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నదానం ప్రారంభించారు.ధర్మకర్తలు సింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గా ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● **జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్**



జాతీయ ఆరోగ్య సేవల నాణ్యత ప్రమాణాలపై సమీక్షిస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, జూన్ 15: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జాతీయ నాణ్యత ప్రమాణాలను పాటించాలని జాతీయ ఆరోగ్య మిషన్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శనివారం ఆయన డీఎన్‌ఏ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జాతీయ నాణ్యత ప్రమాణాల మదింపు అధికారులు మీనాక్షిసుందరం, జేకే సెట్‌లతో కలిసి యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అబ్బవరం గ్రామంలో తనిఖీ చేసి ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో ఆరోగ్య సూచికల మేరకు ఉండవల్సిన పరికరాలు, మందులు, ఐఈసీ సామగ్రి, రికార్డులు, రిజిస్టర్స్, సిబ్బంది పనితీరు, రోజువారీ సర్వీస్ డెలివరీ రిపోర్టు, ప్రతి బుధవారం పంపే నీటి నాణ్యత రిపోర్టు, ప్రతి శనివారం నిర్వహించే హెల్త్ మేళా రిపోర్ట్‌ను పరిశీలించి నివేదికలను రాష్ట్ర అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ఫైజున్నీసా

లక్కిరెడ్డిపల్లె జూన్ 15; ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి మండల లీగల్ ఆథారిటీ చైర్మన్ షేక్ ఫైజున్నీసా సూచించారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని జడ్పీ బాలుర పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ పాటించాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. లక్కిరెడిపల్లె జడ్పీ పాఠశాలలో చదివిన విద్యార్థులు కలెక్టర్లు, ఎస్పీలుగా పనిచేస్తున్నారని తెలియజేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ప్రదానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బత్తల హరిబాబు



మంత్రి సత్యకుమార్‌తో బత్తల హరిబాబు

రాయచోటిటౌన్, జూన్ 15 : ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్‌ను శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేట కు చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బత్తల హరి బాబు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయ న రాయచోటి నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపైన, ఇక్కడ ఉన్న అసౌకర్యాలు, సమస్యలపైన సత్యకుమార్‌కు విన్నవించారు. భవిష్యత్తులో రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించి గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ భవిష్యత్తులో ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు.

గురుకుల పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

గాలివీడు, జూన్ 15: మండలంలోని దానంరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు నల్లమేకల భరత్‌కుమార్‌రెడ్డి, చీపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ముక్కవారిపల్లె గురుకుల పాఠశాలకు. సింగం రెడ్డిశ్రీ, మూడే మీనాక్షి దేవపట్ల గురుకుల పాఠశాల (బాలికలు)కు, నల్లమేకల యశ్విత యర్రగుండ్ల గురుకుల పాఠశాలకు, మూడే సాత్విక్‌నాయక్ పెద్దమండెం మోడల్ స్కూల్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఉపేంద్రకుమార్ తెలిపారు. పిల్లలు ఫలితాలు సాధించడంలో తల్లిదండ్రుల సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

బారికేడ్ల తొలగింపు



బారికేడ్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు(రూరల్) మే 15: వైసీపీ హయాంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్మించిన బారికేడ్లను శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. ఈ బారికేడ్ల కారణంగా చిట్వేలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ అధికారంలోకి రాగానే స్థానికులు ఈ సమస్యను రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన నాయకులు పంచాయతీ అధికారులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, టీడీపీ యువ నాయకులు వార్డు సభ్యులు పోతురాజు నవీన్ శనివారం పంచాయతీ అధికారులతో కలిసి బారికేడ్లను తొలగించారు. పట్టణవాసులు ఇటు చిట్వేలికి వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

జంగాలపల్లె రహదారికి గండి

సిద్దవటం, జూన్ 15 : వర్షాల కారణంగా సిద్దవటం మండలం జంగాలపల్లె గ్రామ పంచాయతీ రహదారిలో గండి పడింది. ఈ గండి ప్రమాదకరంగా మారిందని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటోందని, చాలా చోట్ల రోడ్డు పై గుంతలు పడ్డాయని, దీంతో అంబులెన్స్ వచ్చేందుకు కూడా ఇబ్బందికరంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండిపడిన ప్రాంతానికి మరమ్మతులు చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి

వీరబల్లి, జూన్ 15: మంత్రి పదవిని స్వీకరించిన అనంతరం తొలిసారిగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సొంత నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి ఆయనను కలిసి అభినందించారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి లోని రోగులకు పండ్లు, రొట్టె, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సుకుమార్, కల్పన, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

వైద్య చికిత్సలకు ఆర్థిక సాయం

పెనగలూరు, జూన్ 15 : అనారోగ్యంతో బాధపడుతున్న ఈటిమాపురం గ్రామానికి చెందిన పోతనబోయిన నాగేశ్వరరావుకు కువైట్‌లో ఉన్న పి.సురేష్‌బాబు, పి.వెంకటేశ్వర్లు, పి.శివయ్య రూ. 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం సాయంత్రం మండల మాజీ అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్రమణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవికుమార్ బాధితుడికి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.పెంచలయ్య, టి.కృష్ణయ్య, పి.లక్ష్మీనరసయ్య, సుబ్బరాయుడు, టి.మహేష్ తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు

సిద్దవటం, జూన్ 15 : మండలంలోని డేగనవారిపల్లె పెన్నానదినుంచి ఇసుక అక్రమ రవాణా నివారించడంలో భాగంగా ట్రాక్టర్లు వెళ్లకుండా ఎస్ఈబీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం దారికి అడ్డంగా కాలువ తవ్వించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖ సిబ్బంది, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

పెనగలూరు, జూన్ 15 : మండల కేంద్రంలో 17వ శతాబ్దంలో పొత్తపినాటిని పాలించిన మట్లి వెంకటభూపతి కాలంలో నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సిద్ధమయ్యారు. ఆదివారం అంకురార్పణతో ప్రారంభమై బుధవారం వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు. 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో నిత్యం రాత్రి 10 గంటల తర్వాత తెల్లవారుజాము వరకు తిరుపతికి చెందిన రాధిక భాగవతారిణి, 17, 19న అనసూయ, 20, 21న రాయచోటికి చెందిన ప్రమీల,. 22, 23న రాజమండ్రికి చెందిన విజయలక్ష్మీ, 24న షణ్ముఖి హరికథ వినిపిస్తారు.

ధర్మకర్తగా జిలకర సుబ్బయ్య

ఆలయ ధర్మకర్తగా పెనగలూరుకు చెందిన జిలకర సుబ్బయ్యను గ్రామ పెద్దలు తీర్మానించారు. బ్రహ్మోత్సవాల అనంతరం జరిగే పూజా కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు జిలకర సుబ్బయ్య ఆధ్వర్యంలో జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

రాజనాల బండలో ప్రమాణం అనగానే..

చోరీకి గురైన నగలు లభ్యం



దొరికిన నగలు

చౌడేపల్లె, జూన్15: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజలనాలబండలో సత్య ప్రమాణం అనగానే చోరీకి గురైన నగలు ప్రత్యక్షమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం పందివారిపల్లెకు చెందిన నారమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తోంది. బీరువాలో ఉంచిన రూ.లక్ష విలువ చేసే తాళిబొట్టు చైను, కమ్మలు 15 రోజుల క్రితం కనిపించకుండా పోయాయి. చుట్టుపక్కల వారిని విచారించినా, గ్రామ పెద్దలు పంచాయతీ పెట్టినా లాభం లేకపోయింది. పెద్ద మనుషుల సూచనతో రాజలనాలబండలో సత్య ప్రమాణ ం చేయటానికి అనుమతి తీసుకుని గ్రామస్తులను రావాలని కోరింది. ఈ క్రమంలో శనివారం నిద్ర లేవగానే నగల మూట ఆమె ఇంటి ముందు ప్రత్యక్షమైంది. సంతోషించిన నారమ్మ రాజనాలబండకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి జరిమానా

చిత్తూరు, జూన్ 15: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.10వేలు చొప్పున రూ.1.80లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండు రోజుల క్రితం నగరంలో చేపట్టిన వాహనాల తనిఖీలో మద్యంతాగి వాహనాలు నడిపిన 18మందిని గుర్తించి శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి వెన్నల ముందు ప్రవేశపెట్టారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ ఏడు నెలల వ్యవధిలో 223 మందికి రూ.16లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి





మృతి చెందిన అబ్దుల్ రౌఫ్, ప్రమాదానికి కారణమైన లారీ

వి.కోట, జూన్ 15: కుప్పం - వి.కోట ప్రధాన రహదారిలో దాసార్లపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని సిలిండర్లు తరలిస్తున్న లారీ ఢీకొనడంతో రామకుప్పంకు చెందిన అబ్దుల్‌రౌఫ్ మృతి చెందాడు. శనివారం ఉదయం 10.30 గంటలకు కుప్పం వైపు నుంచి గ్యాస్ సిలిండర్ల లోడ్తుతో వెళుతున్న లారీ అదుపు తప్పి ముందు వెళుతున్న అబ్దుల్‌రౌఫ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో అతని తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ లింగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

15 మందిపై అట్రాసిటీ కేసు

వెదురుకుప్పం, జూన్ 15: 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కార్వేటినగరం సీఐ సత్యబాబు శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం బొమ్మనదొడ్ల కాలనీలో పక్క గ్రామం కోణంగిపల్లెలోని అగ్రవర్ణాల వారు వచ్చి మద్యం తాగారు. దీనిపై ఇరు గ్రామాల వారు ఘర్షణపడ్డారు. ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. తమను కులం పేరుతో దూషించి, దాడులకు పాల్పడ్డారని బొమ్మనదొడ్ల కాలనీకి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో కోణంగిపల్లెకు చెందిన రుక్మాంగధర్‌తో సహా మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

తమిళనాడుకు తరలిపోతున్నా పట్టించుకోని అధికారులు





జగన్నాథపురం రోడ్డు - లక్ష్మీరాజుపేట గ్రామ పంచాయతీలో ఆక్రమణకు గురైన గుట్టలు

కార్వేటినగరం, జూన్ 14: మండలం నుంచి తమిళనాడుకు గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. లక్ష్మీరాజుపేట గ్రామ పంచాయతీ దీనికి కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాంతం తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు తాలూకా కేంద్రాన్ని అనుకుని ఉండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. లక్ష్మీరాజుపేట నుంచి జగన్నాథపురం, తమిళనాడుకు చెందిన పుదుపట్టు మార్గంలో టిప్పర్ల ద్వారా రవాణా సాగిస్తున్నారు. జగన్నాథపురం రోడ్డు పక్కనున్న గుట్టల్లో ఇప్పటికే 50 శాతానికి పైగా మట్టిని తరలించేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా నడిచింది. మండలంలో ఏ ఒక్క గుట్టనూ అక్రమార్కులు వదల్లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ప్రభుత్వం మారడంతో జగన్నాథపురం గ్రామస్తులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సోదరుడు నిధి దృష్టికి తీసుకురావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుపత్తూరులో చిరుత..

కుప్పంలో కలకలం!



తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో చిరుత (ఫైల్ ఫొటో)

కుప్పం, జూన్ 15: తమిళనాడులో చిరుత హల్‌చల్ చేస్తే కుప్పంలో కలకలం రేగింది. అక్కడ పట్టిన చిరుతను కుప్పం నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో వదిలివేశారని వదంతులు రేగడంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. అయితే ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించడం లేదు. కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం సరిహద్దుల నుంచి సుమారు 10-15 కిలోమీటర్ల దూరంలో తమిళనాడు రాష్ట్రం ఉంటుంది. జిల్లా కేంద్రమైన తిరుపత్తూరు గ్రామాల్లో శుక్రవారం చిరుత సంచారం కనిపించింది. ఇళ్ల మధ్య తిరుగుతూ హల్‌చల్ చేసిన ఈ చిరుతను చూసి అక్కడి ప్రజానీకం భయాందోళనకు గురైంది. తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో దూరిన చిరుత, రోగులను ఆందోళనకు గురిచేసింది. స్పందించిన తమిళనాడు అటవీ శాఖాధికారులు దాన్ని బంధించి తీసుకెళ్లారు. అక్కడితో ఆ హడావుడి సద్దుమణిగింది. అయితే బంధించిన చిరుతను ఒక వాహనంలో తీసుకొచ్చి, ఎక్కడో అటవీ ప్రాంతంలో వదిలేస్తున్న దృశ్యాలు శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తమిళనాడు నుంచి చిరుతను తీసుకొచ్చి ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులోని కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం ననియాల తాండా అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు వదంతులు అదే సోషల్ మీడియాలో ప్రచారమయ్యాయి. దీంతో శనివారం ఉదయం నుంచి కుప్పం సమీప అటవీ సరిహద్దు గ్రామాల ప్రజానీకం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. నిజంగానే ఎప్పుడు ఏ క్షణంలో ఏం జరుగుతుందో, ఎప్పుడు ఏ వైపు నుంచి చిరుత వచ్చి మీద పడుతుందోనన్న భయంతో గడుపుతున్నారు. ఈ ప్రచారాన్ని స్థానిక అటవీ శాఖాధికారులు నిర్ధారించడం లేదు. ఆ విషయంలో తమకు స్పష్టమైన సమాచారం లేదని చెబుతున్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో శనివారం ఓ కారు అదుతప్పింది. అదృష్టవశాత్తూ అందులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని శనివారం మధ్యాహ్నం తమ కారులో తిరుగు ప్రయాణమైంది. అలిపిరి టోల్‌గేట్‌కు సమీపంలో వాహనం అదుపు తప్పి కుడివైపున్న చిన్నపాటి గట్టును ఢీకొంది. ఆపై రోడ్డుపక్కకు దూసుకెళ్లి, ముందున్న ఓ బండరాయిని ఢీకొని ఆగిపోయింది. వాహనంలోని నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయంరూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 36,229 మంది తలనీలాలు సమర్పించారు.

పారితోషికం ఎప్పుడిస్తారో?

పనులు చేయించుకుని సాకులు చెబుతున్నారు

ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగుల ఆవేదన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: 'ఎన్నికల్లో గొడ్డుచాకిరీ చేశాం.. పోలింగ్ ముగిసి... ఫలితాలు వెలువడి 12 రోజులవుతున్నా టీఏ, డీఏ పారితోషికం బిల్లులు ఇవ్వకుండా అధికారులు సతాయిస్తున్నారు.. ఇస్తారో చేతులెత్తేస్తారో తెలియడం లేదు' అని ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇవ్వాల్సిన పైకం రూ.కోటికి మించి ఉన్నట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉద్యోగులు ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు కౌంటింగ్ ముగిసే వరకు సేవలు అందించారు. పోలింగ్ నాడు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పీవో, ఏపీవో, ఓపీవోలకు అదేరోజు రాత్రి పారితోషికం ఇచ్చారు. కానీ మిగిలిన 600 మంది ఉద్యోగులకు కేడర్లవారీగా రూ.300 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు బిల్లులు విడుదల కాకపోవడం పట్ల ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.

వచ్చే వారం చెల్లిస్తాం

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ఉద్యోగులందరికీ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పారితోషికాలు వచ్చే వారం చెల్లిస్తాం. ఇప్పటికే అన్ని విభాగాల నుంచి బిల్లులు తెప్పించాం. 600 మంది ఉద్యోగులకు రూ.కోటికి పైగానే చెల్లించాల్సి ఉంది. - డీఆర్వో పుల్లయ్య

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 15: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య అన్నారు. శనివారం ఉదయం తన చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 6-14 సంవత్సరాల్లోపు పిల్లలందరూ ప్రభుత్వ బడిలోనే చదువుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారో లేదో గుర్తించి, చేర్పించాలని ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలు ఈనెల 13 నుంచి జూలై 12వ తేదీ వరకు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. డీఈవో దేవరాజులు, ఎస్ఎస్ఏ పీవో వెంకట్రమణారెడ్డి, డీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకారం నేడు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని శ్రీవారి ఆలయంలోకి వెళ్లనున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మం నుంచి ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

అనధికార తట్టలకు బ్రేక్

తిరుమల కొండపై మొదలైన ప్రక్షాళన



వరాహస్వామి విశ్రాంతి గృహం వద్ద అనధికార తట్టలను మూసివేయిస్తున్న అధికారులు

తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచే ప్రక్షాళన మొదలవుతుందని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు ప్రకటించడంతో టీటీడీ అధికార యంత్రాంగంలో చురుకు మొదలైంది. తిరుమలలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన అనధికార తట్టల (చిన్న షాపులు)ను తొలగించే పని ప్రారంభమైంది. విజిలెన్స్ హెల్త్, రెవిన్యూ విభాగాల టాస్క్‌ఫోర్ బృందం శనివారం తిరుమలలో పలు చోట్ల ఆకస్మిక దాడులు చేసింది. వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనం వద్దనున్న అనధికార తట్టలను మూసివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకముందు కూడా దాడులు కొనసాగుతాయని కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చంద్రబాబు తిరుమలకు వచ్చినపుడు ఆక్రమణలు, అనధికార తట్టల గురించి స్థానిక టీడీపీ కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలైనట్టు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా తట్టలు

నిబంధనల ప్రకారం టీటీడీ నుంచి లైసెన్సులు ఉండేవారే తిరుమలలో వ్యాపారాలు చేసుకోవాలి.అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తట్టలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తట్టలు పెట్టి వ్యాపారాలు మొదలుపెట్టారు. అధికారికంగా లైసెన్సులు పొందినవారి జీవనాన్ని దెబ్బకొట్టేలా అడ్డదిడ్డంగా తట్టలు పెట్టి వ్యాపారాలు చేస్తూ హల్‌చల్ చేశారు. వీరిని టీటీడీ అధికారులు కూడా నియంత్రించలేకపోయారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం నుంచి బయటకు వచ్చే ప్రదేశంలో, వరాహస్వామి విశ్రాంతి గృహం ముందు, షాపింగ్‌కాంప్లెక్స్ వద్ద డీఎంబీ రోడ్డు వంటి ప్రాంతాల్లో తట్టలు భారీగా పెరిగిపోయాయి. వ్యాపారం బాగా జరిగే కొన్ని ప్రాంతాల్లో తట్ట నడుపుకునేవారు దాని యజమానికి రోజుకు రూ.వెయ్యి కూడా చెల్లిస్తుంటారు. ఇంత ఆదాయం వచ్చే మార్గం కావడంతో నాయకులంతా తట్టల మీద పడ్డారు.ఐదేళ్ల వైసీపీ వారు తట్టలు నడుపుకున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే టీడీపీ వారు కూడా అనధికార తట్టలు పెట్టిస్తున్నారు. హోటళ్ల తరహాలో సాగుతున్న ఈ వ్యాపారాలు నిజమైన అనుమతులున్నవారి వ్యాపారాలను దెబ్బతీస్తుండడంతో వారు లబోదిబోమంటున్నారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో ఈనెల 12వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. అదే రోజు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహించనున్న కారణంగా ఈ పరీక్షలు వాయిదా పడ్డాయి. వాయిదా పడిన పరీక్షలు ఈనెల 18వ తేదీ నిర్వహించనున్నట్టు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ వెల్లడించారు.

11 మంది డీబార్

డిగ్రీ 2, 4 వ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. శనివారం పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను హైపవర్ కమిటీ పర్యవేక్షించింది. ఈ సమయంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 11 మంది విద్యార్థులను గుర్తించి డీబార్ చేశారు. తిరుపతి, చిత్తూరుల్లో నలుగురు చొప్పున, మదనపల్లెలో ముగ్గురిని డీబార్ చేసినట్టు దామ్లానాయక్ తెలిపారు.

ముగిసిన తిరుపతి సిరి సంత

తిరుపతి (కల్చరల్), జూన్ 15: నాబార్డు సహకారంతో కనెక్ట్ టూ ఫార్మర్ సంస్థ మూడ్రోజులుగా మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన తరంగ్ (తిరుపతి సిరి సంత) కార్యక్రమం శనివారం ముగిసింది. రైతులు, చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శించారు.





సినీ నటులు సాయిధరమ్ తేజ్, ప్రగ్యా జైస్వాల్ శనివారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

భోగశ్రీనివాసమూర్తికి నేడు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని భోగ శ్రీనివాస మూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరగనుంది. 18 ఏళ్లగా శ్రీవారి ఆలయంలో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉదయం ఆరు నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద భోగశ్రీనివాసమూర్తికి అర్చకస్వాములు ఏకాంతంగా సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు.

రుయాలో 'ఫోర్జరీ'లు ఆగవా?

నా సంతకం ఫోర్జరీ చేశారంటూ డీఎంఈకి సీఎస్ఆర్ఎంవో ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), జూన్ 15: రుయాస్పత్రిలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం ఆగడం లేదు. గతంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ సర్టిఫికెట్ కోసం కొందరు సిబ్బంది ఏకంగా సూపరింటెండెంట్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆరోగ్యశ్రీలో కొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు అయితే వైద్యాధికారులు సంతకాలు ఫోర్జరీ చేసి ఆస్పత్రిలో వైద్యం పొందని రోగుల పేరుతో రూ.లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడం విదితమే. తాజాగా సీఎస్ఆర్ఎంవో తన సంతకాన్ని కొందరు అధికారుల సాయంతో పారిశుధ్య ఏజెన్సీలో పనిచేసే వ్యక్తి ఫోర్జరీ చేసి నాలుగు నెలల బిల్లులను మంజూరు చేసుకున్నారని డీఎంఈకి లక్ష్మా నాయక్ ఫిర్యాదు చేశారు. రుయాస్పత్రిలో ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఏ-1 సర్వీస్‌కు నెలకు రూ.50లక్షలకుపైగా బిల్లులు మంజూరు చేస్తారు. రోజూ పారిశుధ్య ఏజెన్సీ పనితీరును పరిశీలించి.. నెలాఖరులో అడ్మిన్, హెల్త్ సూపర్‌వైజర్, సీఎస్ఆర్ఎంవోలు మార్కులు వేస్తారు. ఈ మార్కుల ఆధారంగానే బిల్లులు చెల్లిస్తారు. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి నుంచి జూన్ వరకు ఏజెన్సీ పనితీరు బాగాలేదని, దానికి సంబంధించి బిల్లులు కొంత కాలం పెండింగ్‌లో పెట్టారు. దాంతో ఆ ఏజెన్సీలో పనిచేసే మేనేజరు రాజేష్ అనే వ్యక్తి ఈ నాలుగు నెలలకు సంబంధించి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు మంజూరు చేయించుకున్నాడని లక్ష్మానాయక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివెనుక రుయాస్పత్రిలోని కొందరు అధికారుల ప్రమేయం కూడా ఉందన్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఈ అంశంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పైగా ఈ విషయంపై రుయా అధికారులను ప్రశ్నిస్తే.. తప్పుడు ఆరోపణలతో తనను సరెండర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారిస్తే నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

PLOTS FOR SALE
తిరుపతి ఎయిర్‌పోర్టు దగ్గరలోని కుర్రకాల్వ నందు గల VVR వెంచర్‌లో Plot-13, 30x40=33 1/2 అంకణముల ఖాళీ స్థలము అమ్మబడును. డైరెక్ట్ ఓనర్. సెల్ : 63023 99367
AJT - 179950

RHEUMATOLOGY
డా.పి. దామోదరం, MD., DM (NIMS) రుమటాలజిస్ట్ - కీళ్లవాతం నిపుణులు, శుభోదయ రుమటాలజి సెంటర్, Opp: SBH Bank, జయనగర్, తిరుపతి. సెల్: 9391344644, 7702322499
AJT-179832

WANTED
కుప్పంలో పార్ట్ టైం పనిచేయుటకు 18 సం॥ నిండిన 10th P/F పురుష అభ్యర్థులు కావలెను. సంప్ర. : 9848315414
AJT - 179949

WANTED
తిరుచానూరులో ప్రముఖ రెసిడెన్షియల్ (లాడ్జ్)కు రిసెప్షనిస్ట్, మేనేజర్ కావలెను. మరియు తిరుమలలో ప్రముఖ హోల్‌సేల్ షాపునకు స్టాఫ్ కావలెను. భోజనము వసతి కల్పించబడును. సంప్ర. : 94402 71743, 92922 04979
AJT - 187451

CHANGE OF NAME
I, SHAIK ARSHAD BASHA, S/ o SHAIK ALLABAKASH, R/ at DNo.31-95/8, Kothaindlu, Punganur T&M, Chittoor Dist, A.P., Herewith Submit that I have changed my name from SHAIKI HARSHAD BASHA (Old Name) Passport No. M2256388 to SHAIK ARSHAD BASHA (New Name) as Per Aadhar Card No.9275 3354 9252, and Pan Card No.EFJPB6729H.
AJT - 187269

PLOT FOR SALE
వడమాలపేట టోల్ ప్లాజా దగ్గరలో రూ.12,50,000లకే ప్లాట్ మరియు తిరుపతి దగ్గర అప్రూవల్ ప్లాట్ అంకణం 40000లకు అమ్మబడును. సెల్ : 97001 19024
AJT - 4008

DIABETOLOGIST
REVA Diabetes Clinic, Best Diabetes Physician in Tirupati. Dr. Rekha Kattula, MBBS, DFM (RCGP,UK), F.Diab (M.Sc Diabetes, UK), 18-3-60/C4, Khadi Colony, TPT, 6301632678
AJT - 187452

FLAT FOR SALE
Newly Constructed 3 BKH, 2000 Sft, East Facing 4th Floor, Near Rathnam School, TML Bypass Road, Tirupati. 100% Vasthu, with Car Parking. 70957 01056, 99858 33399
AJT - 4005

LEASE / RENT
తిరుపతి జీవకోన 60అ., రోడ్డుకు డో.నెం. 21-8-404 గల కమర్షియల్ భవనం G+2 పొ 80అ X 224అ, అన్ని వ్యాపారాలు, ఆఫీసులకు కాలేజీలకు అనుకూలమైనది. సంప్ర. : 99633 52172
AJT - 4006

TO-LET
తిరుపతి రేణిగుంట రోడ్డులోని HDFC Bank ప్రక్కన కమర్షియల్ బిల్డింగ్‌లోని 1st Floor (1200 Sqft, 700 Sq.Ft) or (1900 Sq.Ft) బ్యాంకులకు, ఆఫీసులకు, అద్దెకు ఇవ్వబడును. సంప్ర. : 63039 98108 / 88012 06205
AJT - 4007

WANTED TEACHERS
Wanted teachers for higher class Social, Hindi, Computers, Wardens, PET, S.N Puram, Tirupati. Contact : 92908 98331, 70138 81383.
AJT - 4004

WANTED
Job offer at MNC Company, Business Executive Post @ Tirupathi . Qual :- +2 Work at Hotels & Hospitals... Etc.Salary :- 16000/- to 18000/- starting.Whatsapp your resume:8099621364
AJT - 1934

TO-LET
Spacious Double Bedroom Portion, 24 Hrs Water, Near MRP Police Station & Canara Bank, R.C. Road, Tirupati is for rent, Cont. : 98497 01350
AJT - 10546

PLOTS FOR SALE
తిరుపతి, చిత్తూరు నేషనల్ హైవేకి ప్రక్కన, తొండవాడ దగ్గర, బిర్లా స్కూల్‌కి ఎదురుగా సన్నిధి హోమ్స్, తుడా అప్రూవల్ లే-అవుట్, 55అం. ప్లాట్, నెం.110, అంకణం రూ. 1,35,000, NRI పేమెంట్‌కి డిస్కౌంట్ కలదు. సంప్ర. : 95027 04384
AJT - 3101

FLATS FOR SALE
తిరుపతి శాంతినగర్ పార్కు వెనుక అపార్ట్‌మెంట్‌లో 3rd ఫ్లోర్‌లో 1200sft లతో తూర్పు ముఖం గల ఫ్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రదించండి: 9666565762
AJT - 10548

PLOTS FOR SALE
తిరుపతి బస్టాండ్ నుండి కేవలం 3 కి.మీ.లలో తాజ్ హోటల్, రఘునాథ రిసార్ట్స్, పీఎల్ఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ దాటగానే రోడ్డుకు ఆనుకొని తనపల్లి వద్ద విల్లా లేదా ఇల్లు కట్టుకునే 100% వాస్తు ప్లాట్స్ అమ్మబడును. అప్పట్లో తనపల్లిలో ప్లాట్స్ కొనమని చెప్పినప్పుడు దూరం మరియు రేట్లు ఎక్కువ అన్నారు. ఆ రోజు ముందు చూపుతో కొన్నవారు ఈనాడు కోటీశ్వరులు. సంప్ర. : 73861 43336
AJT - 3100

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాల నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 179830

FLAT FOR SALE
ఫ్లాట్ ఫర్ సేల్ అమిగోస్ అపార్ట్మెంట్ నందు 3 BHK అమ్మకము కలదు Sft 4000 Total 1775 అమ్యూనిటీస్ చార్జెస్ 4,50,000 ఎక్స్ట్రా మంగళం రోడ్‌లో డీమార్ట్ ఎదురుగా ప్రక్కన Cell No 90595 20007.
AJT - 3063

HOUSE FOR SALE
నార్త్ ఫేసింగ్ G+2 హౌస్, 13 అంకణాలు, పూలవీధి, ప్రకాశంరోడ్, తిరుపతి, అద్దె ఆదాయం: 21000 సంప్రదించండి: 9908650529, 9986329469
AJT-179940

HOUSE FOR SALE
న్యూ ఇండిపెండెంట్ హౌస్ తిరుపతి పరసర ప్రాంతాలలో (చదలవాడ కాలేజీ వెనుక, నారాయణాద్రి హాస్పిటల్, గొల్లవాని గుంట, నారాయణపురం, తనపల్లి దగ్గర) అమ్మబడును. సెల్: 98499 59305, 90526 74774
AJT-4003

WANTED
Accounts Manager (Tally), Sales Manager, Sri Gopi Krishna Oil Traders, Beri Street, Tirupati. Cont. : 93939 22999, 97049 56789
AJT - 187362

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రైల్వే పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 189260

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7842241787
AJV_192850

WANTED
Primary & High School Teachers, Comp., Assts. Telecallers వంట మనిషి, పని మనుషులు, ఆయాలు కావలెను. రేణిగుంట రోడ్డు. Cont :82474 57565
AJT - 3078

PROPERTY FOR SALE
★ G+2 building in 56 ankanams (7 houses), Gowri Nagar (Line 2), Renigunta. Ph: 8500206122
AJH-0311

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఇచ్చిన మాట తప్పని చంద్రబాబు

●ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుతో ప్రజలకు ఊరట ●ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హర్షం● పింఛన్ల పెంపు అన్నివర్గాలకు వరం



వాల్మీకిపురంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



పింఛన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీఎస్ నేత ఎస్.మౌలాలి

మదనపల్లె టౌన్, జూన్ 15: గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అధికారంలోకి వస్తూనే సీఎం చంద్రబాబునా యుడు రద్దు చేస్తూ సంతకాలు చేయడంతో ప్రజలకు ఊరట లభిం చిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు వద్ద న్యాయవాదుల ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషే కం నిర్వహించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్ట గానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు ఉమ్మడి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో శివకుమార్‌రెడ్డి, గణపతి, నగేష్, కాలం రఘుపతి, చైతన్య, సుజా త, బాలజ్యోతి ,మాలతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు అన్నివర్గాలకు వరం

మదనపల్లె, జూన్ 15: కొత్తగా అధికారం చేపట్టిన ఎన్‌డీఏ ప్రభుత్వం పింఛన్ల పెంపు అన్ని వర్గాల లబ్ధిదారులకు వరం లాంటిదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర నాయకుడు ఎస్.మౌలాలి పేర్కొన్నారు. స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో శనివారం పింఛన్ లబ్ధిదారుల తో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు పింఛన్లపెంపుపై మొదటి సంతకం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచడంతో పాటు దివ్యాంగులు, కుష్ఠువ్యాధిగ్రస్తులకు రూ.6వేలు, కిడ్నీ, కాలేయం, గుండెమార్పిడి వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చేయడాన్ని ఈసందర్భంగా కొనియాడారు. అనంత రం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వెంకటపతి, గోపాల్, శ్రీరాములు, సోమశేఖర్‌రెడ్డి, థామస్, దొరస్వామి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: ప్రజల సంక్షేమం కోసం ఏదైనా మాట ఇస్తే తప్పక నెరవేర్చే గొప్ప నాయకుడు సీఎం నారా చంద్రబాబునాయుడని కూట మి పార్టీల నాయకులు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల శనివారం వాల్మీకిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తిం చారు. అలాగే వాల్మీకిపురంలో నిరుద్యోగ యువత సీఎం డీఎస్సీ సంత కంపై కేక్ కట్ చేసి పంపిణీ చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీ తప్పక నిలబెట్టు కుంటా రన్నారు. కార్యక్రమంలో పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్య ద్‌బాషా, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, బొక్కసం బ్రదర్స్, మస్కట్ మస్తాన్, తోటవీధి ఫణి, నాగరాజ,సైదు, గాంధీపేట రెడ్డి, చాను, కువైట్ సయ్యద్‌బాషా, మురళి, అడ్వకేట్ రమణ,డిష్ బ్రద ర్స్, ఖలందర్, గాంధీపేట రెడ్డి, సాంబ, జావీద్, శంకర్, రమణ, గోవిం దు, కేకే నాయుడు, మహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

కలకడ, జూన్ 15:ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల చదువు ప్రత్యే క దృష్టి సాధించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల శుభ్రతపై శ్రద్ధవహించాలన్నారు. గత విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో ఉత్తీ ర్ణత శాతం పెరిగిందన్నారు. ఈ ఏడు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్రనా యక్, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తంబళ్లపల్లె, జూన్ 15: తంబళ్లపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల విద్యార్థులకు శనివారం నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పం పిణీ చేసినట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి స్టూడెంట్స్ కిట్లను మండలంలోని 68 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చేరవేయగా శనివారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కిట్లను విద్యార్థులకు అందచేసినట్లు తెలి పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్య మైన విద్యను అందించడం జరుగుతోందని, విద్యార్థుల తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించండి



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

పీలేరు, జూన్ 15: క్యాన్సర్ వ్యాధిపై సామాన్య ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. పీలేరు ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులకు నిర్వహిస్తున్న క్యాన్సర్‌పై అవగాహన శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ అవగాహనతోనే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స సులభతరం అవుతుందన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్పిస్తున్న అంశాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని తమ పీహెచ్‌సీ లు, ఆసుపత్రుల పరిధిలోని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆసుపత్రిని వివిధ వార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె టౌన్, జూన్ 15: మదనపల్లెలో కోర్టు ఆవరణలో ఈనెల 29వ తేదిన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూని యర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్‌రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.శిరీష పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు హాల్లో రెండవ అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహం సూచనలతో మదనపల్లె పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ కక్షిదారులకు లోక్ అదాలత్‌ను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య

కలకడ, జూన్ 15:ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని కోన హైస్కూల్ హెచ్‌ఎం చెంగల్‌రాయులు పేర్కొన్నారు. శనివారం ఆయన బంగారువాండ్లపల్లె, తిప్పగారిపల్లె, కోనగుడిబండ గ్రామాల్లో తల్లిదండ్రులను కలుసుకుని వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, మహేశ్వరి, నాగమునినాయక్, రమేష్‌రెడ్డి, గఫార్‌ఖాన్, సైరాబాను, ఝాన్సీరాణి, రెడ్డెప్పలు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు టీడీపీ నేతలు

గుర్రంకొండ, జూన్ 15:రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తిరుమలకు కాలినడకన వస్తా మంటూ ఆ గ్రామ టీడీపీ నాయకులు శనివారం తిరు మలకు కాలినడకన బయలుదేరారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయితీ అరిగెలవారిపల్లెకు చెందిన సుమారు 20 మందికిపైగా నాయకులు, యువకులు వెంకటేశ్వరస్వామి దర్శించుకోవడానికి శుక్రవారం కాలి నడకన బయలుదేరారు.

మతసామరస్యంతో బక్రీద్ నిర్వహించుకోవాలి

●పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 15: మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ప్రజలు మతసామరస్యంతో బక్రీద్ పండుగ నిర్వహించుకోవాలని డీఎస్పీ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చట్టానికి లోబడి గోమా తలు, దూడలను ఖుర్బాని ఇవ్వరాదన్నారు. వన్ టౌన్ సీఐ ఉజాల వలీ బషు మాట్లాడుతూ కొంత మంది మూఢనమ్మకాలతో ఇంటి గడపలో ఖుర్బాని ఇస్తుంటారని అటువంటి వారికి ముస్లీం మతపెద్దలు అవ గాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టు టౌన్, తాలూకా సీఐ లు యువరాజు, శేఖర్, బీజేపీ నాయకుడు భగవాన్, హిందూ, ముస్లీం లు పాల్గొన్నారు.

పరమత సహనం పాటించండి

పీలేరు, జూన్ 15: త్వరలో రాను న్న బక్రీద్ పండుగ నేపథ్యంలో పీలేరు పట్టణంలోని అన్ని మత స్థులు పరమత సహనం పాటిం చాలని పీలేరు అర్బన్ సీఐ మో హన్ రెడ్డి పట్టణంలోని మతపె ద్దలను కోరారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శనివారం ఆయన తన కార్యాలయంలో పీస్ కమిటీ సమా వేశంలో మాట్లాడుతూ మతసామరస్యం కాపాడుతూ పండుగ జరుపు కోవాలన్నారు. ఖుర్బానీ ఇచ్చే ముస్లింలు తమ ఇళ్ల మధ్యలో ఉండే ఇతర మతాల వారి మనోభావాలు గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు, ముతవల్లీలు అల్లాఉద్దీన్, గడిబాషా, రియాజ్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు విరూపాక్షం కుమార స్వామి వారణాశి మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, సుదర్శన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన అంగళ్లు గొర్రెల సంత



కిటకిటలాడుతున్న అంగళ్లు గొర్రెల సంత, కాశ్మీరీ జాతి పొటేళ్లు

కురబలకోట, జూన్ 15: బక్రీద్ పండుగ రానుం డటంతో మండలంలోని అంగళ్లులో శనివారం నిర్వ హించిన గొర్రెల సంత కిటకిటలాడింది. ఈ పం డుగ ఈ నెల 17న రానుం డటంతో సాధార సమయా ల్లో కంటే అంగళ్లులో గొర్రెల సంతకు రెట్టింపు స్థాయిలో గొర్రెలు, పొటేళ్లు, మేకపోతులు వచ్చాయి. దీంతో పాటుగా ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. సంతకు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు, అమ్మకపుదారులు పెద్దసంఖ్య లో తరలిరావడంతో సందడి నెలకొన్నది. దాదాపుగా సంతకు 5వేలకు పైగా పొటేళ్ళు మేకపోతులు రావడంతో దీంతో దాదాపుగా రూ.రెండు కోట్ల రూపాయల వ్యాపారలావాదేవీలు జరిగాయి. కాగా వీటి సైజులను బట్టి రూ.20వేల నుంచి లక్ష వరకు అమ్మబలికింది. కాగా సంతలో కాశ్మీరీ జాతి పొట్టేళ్ళు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంతలో ఇబ్బందు లు కలుగకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సన్మానం

మదనపల్లె అర్బన్, జూన్ 15: మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను శనివారం బీజేపీ మదనపల్లె మండల అధ్యక్షుడు పచ్చిపాల వసంత కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రధాన మంత్రి మోదీ ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబునా యుడు దూరదృష్టి అనుసరించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు.

తిరుపతి ఎమ్మెల్యేను కలిసిన జనసేన నేత

తంబళ్లపల్లె, జూన్ 15: తంబళ్లపల్లె జనసేన మండల నాయకుడు ఎద్దుల నరసింహులు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను శనివా రం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచి మెజార్టీతో గెలిచిన శ్రీనివాసులను కలసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డికి సన్మానం

పీలేరు జూన్ 15: డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం శనివారం నగరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మలిగి రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు, శాలువలతో ఎమ్మెల్యేకి అభినం దనలు చెప్పారు. మదనపల్లె బీటీ కళాశాల అధ్యాపకులు డి.శ్రీనివాసు లు, కలికిరి మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గులాబ్‌జాన్, అధ్యాపకులు మాధవి, పీలేరు డిగ్రీ కళాశాల అధ్యాపకులున్నారు.

గంగమ్మ గుడిలో తనూజా రెడ్డి పూజలు

పీలేరు, జూన్ 15: పీలేరు పట్టణం ఇందిరమ్మ కాలనీలోని గంగమ్మ గుడి లోపలున్న పుట్టకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజ రెడ్డి పూజలు నిర్వహించారు. శనివారం పట్టణానికి చెందిన పలువురు తెలుగు మహిళలు వెంట రాగా ఆమె ఆలయంలోని పుట్టకు సాంప్రదాయ పద్ధతుల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కురబలకోటలో చోరీ

కురబలకోట, జూన్ 15: మండలంలోని కురబలకోటలో శని వారం చోరీ జరిగింది. దీనికి సంబంధించి బాధితుల కథనం మేరకు...ఆర్యవైశ్య బజారుకు చెందిన వెంకటనారాయణ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దొంగలు ఇంటి వెనుకవైపు నుంచి ఇంట్లోకి చొ రబడి ఇంట్లో బీరువా తాళాలను పగలకొట్టి అందులోని 42 గ్రా ముల బంగారాన్ని దొంగలించుకెళ్ళారు. కాగా శనివారం మధ్యా హ్నం ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగానే చోరీకి గురైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రప్పించి తనిఖీలను నిర్వహించారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ టికెట్లు అమ్మకం దారులపై కేసు నమోదు

వాల్మీకిపురం, జూన్ 15: పట్టణంలో లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు శనివా రం పేర్కొన్నారు. పట్టణానికి చెందిన గొడుగు రామాంజులు, వెంకటాచలపతి, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా లాటరీలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ తెలిపారు.

18న వాహనాల వేలం

ములకలచెరువు, జూన్ 15: ములకలచెరువు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతి ప్పసముద్రం మండలాల్లో జరిగిన దాడుల్లో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 18న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సీఐ రామ్మోహన్ తెలిపారు. నాలుగు చక్రాల వాహనాలతో పాటు ద్విచక్రవాహనాలకు వేలం పాటలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సెబ్ కార్యాలయంలో ఎస్‌ఈబీ జిల్లా సూపరెంటెండెంట్ సమక్షంలో జరిగే వాహనాల వేలం పాటల్లో ఆసక్తి గల వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉం టుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు వితరణ

బి.కొత్తకోట, జూన్15: బక్రీద్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పోకనాటివీధిల ఉన్న దారుల్‌తౌహీద్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రూ.50వేల విలువైన దుస్తులను పంపిణీ చేశా రు. శనివారం తౌహీద్ మసీదు వద్ద కార్యక్రమం నిర్వహించి 60 మంది మున్సిపల్ కార్మికులకు, మరో 30 మంది నిరుపేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్థానిక మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ దుస్తులను వితరణ చేసి న సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెంగల్‌రాయుడు, సీపీఐ నాయకులు బషీర్, వెంకటరెడ్డి, సమీ వుల్లా, మసీదు ప్రెసిడెంట్ ఖాజాపీర్, సభ్యులు అమీర్, సమీవు ల్లా, ఖాదర్‌వల్లి, ఫయాజ్, సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడుల కేసుల్లో ముగ్గురిపై కేసు నమోదు

పెద్దమండ్యం, జూన్ 15: పరస్పర దాడులు చేసుకున్న కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పెద్దమండ్యం ఎస్‌ఐ రవికు మార్ వెల్లడించారు. ఎస్‌ఐ వివరాల మేరకు మండలంలోని దిగువపల్లికు చెందిన జయమ్మ, ఆమె భర్త రమణరెడ్డి దిగు వపల్లి పంచాయతీ లోనే ఉన్న వడ్డివంకతాండకు చెందిన రవి నాయక్‌ల మధ్య గురువారం రాత్రి దాడి ప్రతి దాడులు జరిగా యి. ఈ దాడిలో రవినాయక్‌కు తలకు తీవ్రంగా గాయాలై మద నపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రవినాయక్ ఫిర్యాదు మేరకు జయమ్మ, రమణరెడ్డి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అలాగే జయమ్మ ఫిర్యాదు మేరకు రవినాయక్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దిగువపల్లిలో జరిగిన దాడి ప్రతి దాడికి కారణం రమణారెడ్డి కుమారుడు యుగంధర్‌రెడ్డి, రవినా యక్‌ల మధ్య పాత కక్షలేనని ఎస్‌ఐ వెల్లడించారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బి.కొత్తకోట, జూన్15: బడిఈడి పిల్లలు బడిలోనే ఉండాలని బి.కొత్తకోట ఎంఈవో రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలి కల జడ్పీహైస్కూల్‌లో శనివారం బాలికాఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. బేటీబచావో.. బేటీ పడావో ప్లకార్డులను ప్రదర్శిం చారు. కార్యక్రమంలో భాగంగా పలుగ్రామాలలో తిరిగి బడిఈ డు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలంటూ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, శైలజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ టీకాలు వేయించుకోండి

బి.కొత్తకోట, జూన్15: క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీజీ టీకాలను ప్రతి ఒక్కరూ వేయిం చుకోవాలని డివిజినల్ టీబీ వైద్యాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోట సామాజిక ఆరోగ్యకేంద్రంలో రెండు మం డలాలకు చెందిన ఆరోగ్య కార్యకర్తలతో బీసీజీ టీకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని టీబీ రహిత సమాజం కోసం పాటుపడాలని కోరారు. పట్టణం లోని పలు ప్రాంతాలలో తిరిగి కార్యక్రమ నిర్వహణ పై తనిఖీ లు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కిరణ్, ఎస్థాని, సబ్‌యూనిట్ ఆఫీసర్ ఖలీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గోవులను రవాణా చేయకుండా అడ్డుకోవాలి

కలికిరి, జూన్ 15: మండలం నుంచి గోవులను పెద్ద సంఖ్యలో కబేళాలకు తరలిస్తున్నారని, ఇలా అక్రమంగా తరలించడాన్ని పోలీసులు అడ్డుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన గోరక్ష విభాగం కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలం నుంచి ప్రతి రోజూ గోవులను భా రీ ఎత్తున వివిధ ప్రాంతాల్లోని కబేళాలకు నిరాటంకంగా తరలి స్తున్నారని వీహెచ్‌పీ జిల్లా గోరక్ష ప్రముఖ్ డేరంగుల హరినాథ ప్రతాప్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గోమాతను రక్షించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేసినా అవి అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రతి రోజూ భారీ వాహనాల్లో తరలిస్తున్నా అడ్డుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందు కోసం చెక్‌పోస్టులున్నా చర్యలు తీసుకో వడం లేదని చెప్పారు. గోవుల అక్రమ రవాణాను నియంత్రించ డానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్.ఓ.సి. నెం.907/2006/ఆర్.ఐ. పురపాలక సంఘం కార్యాలయము
రాజంపేట, తేది : 15.06.2024

వేలము నోటీసు

రాజంపేట పురపాలక సంఘంనకు సంబంధించిన దిన మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండ్ గేట్ మరియు జంతువధశాలకు సంబంధించి ఫీజులు వసూలు చేసుకొను గుత్త హక్కును తేది 01.07.2024 నుండి 31.03.2025 వరకు గుత్తకు ఇచ్చుటకు తేది 24.06.2024 సోమవారం ఉదయం 12.00 గంటలకు మరియు మార్కెట్, ఈడిగపాలెం షాపింగ్ కాంప్లెక్స్, పాతబస్టాండు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నందు ఖాళీగా వున్న షాపు రూములను తేది. 24.06.2024 సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజంపేట పురపాలక సంఘం సమావేశ భవనము నందు కమీషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన అధికారిచే గానీ బహిరంగ వేలము నిర్వహించ బడును.

వేలము షరతులు మరియు నిబంధనలు ఆఫీసు పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును. ఏదైని వేలము వాయిదా వేయుటకు రద్దు చేయుటకు మునిసిపల్ కమీషనరు వారు పూర్తి అధికారము కలిగివుందురు.

కమీషనరు, రాజంపేట పురపాలక సంఘం

సీఎం చంద్రబాబునాయుడును కలిసిన టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబును సన్మానిస్తున్న మనోహర్‌నాయక్

పెద్దమండ్యం, జూన్ 15: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీఎం నారా చంద్రబాబునాయు డును రాష్ట్ర టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహ ర్‌నాయక్ శనివారం అమరావతిలోని సీఎం క్యాంప్ కా ర్యాలయంలో కలసి మాట్లాడి కూటమి విజయోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం సీఎం చంద్రబబాబునా యుడుకు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తిరు పతి పార్లమెంట్ ఎస్టీసెల్ అధ్యక్షుడు సుబ్బయ్య తదితరు లు ఉన్నారు.

టీడీపీ సామాన్య కార్యకర్త కుటుంబానికి న్యాయం

● వైసీపీ కక్ష సాధింపులో ఉద్యోగం కోల్పోయిన పంచాయతీ కార్మికుడు

● టీడీపీ నేత జయచంద్రారెడ్డి చొరవతో మళ్లీ ఉద్యోగం



తాళాలు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూన్ 15: టీడీపీ సామాన్య కార్యకర్త కుటుంబానికి న్యాయం జరిగింది. వైసీపీ కక్ష సాధింపులో ఉద్యోగం కోల్పోయిన పంచాయతీ కార్మికుడికి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధాల చొరవతో మళ్లీ ఉద్యోగం వచ్చింది. పాత ములకలచెరువుకు చెందిన నాగరాజు పదేళ్లుగా ములకలచెరువు గ్రామ పంచాయతీ కార్యాయంలో వాటర్ మెన్‌గా పనిచేసేవాడు. ఈయన కుటుంబ పెద్దలు టీడీపీకి అనుకూలంగా ఉండేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న నాగరాజును కక్ష సాధింపుతో విధుల నుంచి తొలగించారు. దీంతో ఆ కుటుంబం కుమిలిపోయింది. ఈ క్రమంలో టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధాలు విషయాన్ని ఉన్నతాధికారులు, ఎంపీడీవో పోలప్ప దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతా ధికారుల అధికారుల ఆదేశాలతో శనివారం పంచాయతీ కార్మికుడు నాగరాజును స్థానిక అధికారులు విధుల్లోకి తీసుకున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం చేతుల మీదుగా నీరు వదలడానికి బోరు మోటర్ల స్టార్టర్ల తాళాలు అందుకున్నాడు. తనకు మళ్లీ పంచాయతీ కార్మికుడిగా ఉద్యోగం వచ్చేలా కృషి చేసిన టీడీపీ నేత జయచంద్రారెడ్డి, పాలగిరి సిద్ధాలకు నాగరాజు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్ర మంలో టీడీపీ మహిళా నాయకురాలు గంగాదేవి, నాయకులు సుధాకర్‌నాయుడు, రవి పాల్గొన్నారు.

వాల్మీకులకు బోయకొండ ఛైర్మన్ పదవి ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, జూన్15: ప్రఖ్యాత బో యకొండ అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని వీఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షు డు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మం డలం బోయకొండలో వెలసిన బోయకొండ గంగమ్మ దర్శనం కోసం మూడు రాష్ట్రాల నుం చి భక్తులు వస్తుంటారన్నారు. ఇక్కడ మొదటి పూజ సైతం అనాదిగా బోయలే చేయడం ఆనవాయతీగా వస్తోందని అయితే అంతటి మహా చరిత్ర కలిగిన బోయకొండ ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి బోయలకు కేటాయించి అమ్మవారికి సేవ చేసే భాగ్యం కల్పించాలని అనేక ఏళ్ళుగా పాలక ప్రభుత్వాలను కోరు తున్నా స్పందించడంలేదన్నారు. అగ్రవర్ణాలకు పదవులు కట్టబెడుతూ బోయలను చిన్న చూపు చూస్తున్నారని పొదల నరసింహులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బోయ సామాజిక వర్గానికి చెందిన గంపల గంగరాజును ఆలయ కమిటి ఛైర్మన్‌గా నియమించాలని మరో మారు విన్నవించారు.

మంత్రి మండిపల్లికి మదనపల్లె నేతల స్వాగతం



మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేత సీడ్ మల్లికార్జుననాయుడు

మదనపల్లె, జూన్ 15: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి రాయ చోటికి విచ్చేసిన మండిపల్లె రామ్‌ప్రసా ద్‌రెడ్డి మదనపల్లె నేతలు ఘన స్వాగతం పలికారు. మదనపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత సీడ్ మల్లికా ర్జుననాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రాయచోటికి వెళ్లి మంత్రి హోదాలో శనివారం జిల్లా కేంద్రా నికి వచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వా గతం పలి కారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి మల్లికార్జున నాయుడు ఆధ్వర్యం లో 150 వాహనాల్లో రాయచోటి అన్నమయ్య సర్కిల్‌కు వెళ్లి మంత్రికి ఘనస్వా గతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో మల్లికార్జున నాయు డు, మంత్రి మండిపల్లెకు వేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యా లయా నికి చేరుకున్న టీడీపీ శ్రేణులను మంత్రికి పరిచయం చేశారు.

వయో వృద్ధులను ప్రేమాభిమానాలతో చూడాలి

మదనపల్లె అర్బన్, జూన్15: వయోవృ ద్ధులను ప్రేమాభిమానాలతో చూడాలని వక్తలు సూచించారు. స్థానిక బెంగళూ రు రోడ్డులోని జీఆర్టీ హైస్కూల్‌లో ప్ర పంచ వయో వృద్ధుల వేదింపుల నివా రణ దినోత్సవంపై అవగాహన కార్యక్ర మం ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరిగిపోతున్న మానవ విలువలు, నైతిక విలువ లు, కుటుంబబాంధ్యవాలు కనుమరుగు అవుతున్నాయన్నారు. ఆదునిక జీవన శైలి, వృద్ధు లకు సేవలు చేయడం యువతరం మర్చిపోవడం కారణమన్నారు. వృద్ధులను శారీరంగా, మానసికంగా, లైంగికంగా వేధించడం లక్ష్యంగా పెట్టుకు న్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షులు శకుంతలమ్మ, జగన్‌మోహన్, రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, కృష్ణమూర్తి, రామచంద్రయ్య, కృష్ణకుమార్, నాగరాజ, జయన్న, ధనలక్ష్మీ. కాంతమ్మ, ఎన్‌వీ నాయుడు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు నాలుగు వినతులు

మదనపల్లె అర్బన్, జూన్15: ఆర్టీసీలో ఏర్పాటు చేసిన డయల్ యువర్ డీఎం కార్యక్ర మానికి ప్రయాణికులు, ప్రజల నుంచి ఐదు వినతులు వచ్చినట్లు వన్ డిపో డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శాకంవారిపల్లె సర్వీసు బస్సు సాయం త్రం కలికిరిలో నిర్ణీత సమయంకంటే ముందుగా బయలుదేరుతుందని, సర్వీసు సమ యంలో బస్సు నడిపేలా చూడాలని కోరారు. రంగ నాథపురం సర్వీసు షెడ్యూల్ ప్రకారం నడపాలని బస్సు ముందర పెద్ద అక్షరాలతో బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారన్నారు. అలాగే మదనపల్లె చిత్తూరు బస్టాండ్ ఉంచి సీటీఎంకు షెటిల్ సర్వీసులు నడపాలని, తంబళ్లపల్లె మీదుగా ఎన్‌పీ కుంటకు నడుపుతున్న సర్వీసును దండువారిపల్లె మీదుగా నడపాలని ఇద్దరు విన్నవించారు. సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సందర్భంగా డీఎం మూరే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సీటీఎం - మదనపల్లె షెటల్ నడపడానికి జిల్లా అధికారుల అనుమతి కోరుతామన్నారు.

మీ సేవ కేంద్రాలను తనిఖీ చేసిన డీఎల్‌డీవో

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, జూన్ 15 : మండలం లోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న మీ సేవ కేంద్రాలను శనివారం డీఎల్‌డీవో లక్ష్మీ పతి తనిఖీ చేశారు. మండల అభివృద్ధి అధి కారి బ్రహ్మానందరెడ్డితో కలసి పలు మీసేవ కేంద్రాలను తనిఖీ చేసి ఆయా కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. కేంద్రా ల్లో జరిపి న లావాదేవీలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. ఆయా ధృవీకరణ పత్రాలకు రుసుము ప్రభుత్వం నిర్దేశించిన రేటును మాత్రమే తీసుకో వాలని సూచించారు. కాగా బి.కొత్తకోట పట్టణంలోని పలు మీ-సేవా కేంద్రాలను డీఎల్‌డీవో లక్ష్మీపతి శనివారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో సిటిజన్ చార్టరు, రిజిస్టర్ల నిర్వహణ, కంప్యూటర్లు, ప్రింటర్ల పనితీరు ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజీనామా

గుర్రంకొండ, జూన్ 15:వాల్మీకిపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవినాయక్ తన పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్లు కార్యదర్శి కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో ఆ ప్రభుత్వం నియమించిన నామినేటడ్ పదవులకు వైసీపీ నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. గుర్రం కొండ మండలానికి చెందిన రవినాయక్‌ను వాల్మీకీపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రెండోమారు కొనసాగిం చారు. ఈ క్రమంలో తన పదవికి రాజీనామా చేసినట్లు కార్యదర్శి కుమార్‌రెడ్డి తెలిపారు.